epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి : 18 సంచిక : 239 ఎడిటర్ : విక్రం కుమార్ గురువారం 08 మే 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

# ఉగ్రమూకపై రుద్రతాండవం

- భారత విజయ సిందూరం
- మసూద్ అజార్ కుటుంబం అంతం
- 80 మంది ఉగ్రవాదుల హతం
- 31 మంది అని ప్రకటించిన దాయాది దేశం
- 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం
- స్వయంగా పర్యవేక్షించిన ప్రధాని మోదీ

**మే 7, సమయం న్యూస్, ఢిల్లీ:** ఉగ్ర మూకలపై భారత్ ఉరిమింది. అర్ధరాత్రి రుద్ర నేత్రం తెరిచింది. మహిళల మంగళ సూత్రాలను తెంపేసిన ముష్కర మూకల పీచమణిచింది. ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పింది. మంగళవారం రాత్రి అందరూ నిద్రపోతున్న వేళ.. క్షిపణులు, డ్రోన్లతో పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో విరుచుకుపడింది. మన సరిహద్దులకు ఆవల 100 కిలోమీటర్ల దూరం వరకూ వెళ్లి 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. 80 మంది ఉగ్రవాదులను హతమార్చింది. పహల్గాం దాడికి ప్రతీకారం తీర్చుకుంది. ఇంత భారీ స్థాయిలో దాడులు చేసినా తన బాధ్యతను భారత్ మరిచిపోలేదు. ఎక్కడా పాక్ సైనిక స్థావరాలపైగానీ, పౌరుల నివాసాలపైగానీ దాడి చేయలేదు. ఉద్రిక్తతలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడలేదు. ప్రపంచానికి ముప్పుగా ఉన్న ఉగ్రవాద మూలాలను పెకలించడానికే ప్రాధాన్యమిచ్చింది. ఈ మొత్తం ఆపరేషన్‌ను ప్రధాని మోదీ స్వయంగా పర్యవేక్షించారు. దాడుల అనంతరం క్యాబినెట్ సమావేశం నిర్వహించిన ఆయన.. భారత సైన్యం జరిపిన విజయవంతమైన దాడులను ప్రశంసించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి పరిస్థితిని వివరించారు. మరోవైపు సంయమనం పాటించాలని భారత్, పాక్‌లకు ప్రపంచ దేశాలు పిలుపునిచ్చాయి.

తరువాయి 2లో



## ఓఎంసీ కేసులో... ఐఏఎస్ అధికారి

- అక్రమ మైనింగ్ కేసు నుంచి ఆమెకు విముక్తి కల్పిస్తూ...
- తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసిన సుప్రీంకోర్టు
- పిటిషన్‌పై మళ్లీ విచారించి 3 నెలల్లోపు ఉత్తర్వులివ్వాలని ఆదేశం



2లో





## స్వదేశాన్ని గాలికొదిలి.. భారత్‌పై ద్వేషంతో..!

- ఉగ్రవాదానికి పాక్ ఊపిరి
- సరిహద్దులు దాటించి శిక్షణ

**మే 7, సమయం న్యూస్, హైదరాబాద్:** తమ పిల్లల చదువుల కోసం బడులు నిర్మించలేదు గానీ కశ్మీర్ కోసం 'ఉగ్రవాద పాఠశాలలు' నడిపారు. తమ దేశ ప్రజల జీవితాలను బాగుపరిచే ప్రణాళికలు రచించలేదు గానీ కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోడానికి రూ.లక్షల కోట్లు వెచ్చించారు. తమ ప్రజలకు మంచినీరు, కరెంటు, రోడ్లులాంటి కనీస సదుపాయాలు కల్పించలేదు గానీ కశ్మీర్‌లో మిలిటెంట్లపై ఏటా వేలకోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు! ఇదీ... ఆది నుంచీ పాకిస్థాన్ నిర్వాకం! 1947లో విడిపోయిన నాటి నుంచి నేటి దాకా భారతదేశంపై పాకిస్థాన్ ప్రత్యక్ష, పరోక్ష యుద్ధం చేస్తునే ఉంది. ప్రత్యక్ష యుద్ధాల్లో భారత్‌తో ఘోరంగా ఓడిపోయిన పాక్... ఆ తర్వాతి నుంచి దొంగదెబ్బ తీయడానికి నడుం బిగించింది. కశ్మీర్‌లో ఉగ్రవాదానికి ఊపిరిపోస్తూ ప్రజల్ని ఇబ్బందుల పాల్జేస్తోంది. ఆపరేషన్ టొపాక్: సైన్యాధికారి జనరల్ మహమ్మద్ జియా ఉల్ హక్ ఆదేశాలతో పాకిస్థాన్ గూఢచారి సంస్థ (ఐఎస్ఐ) 1988లో ఆపరేషన్ టొపాక్‌ను ఆరంభించింది.

తరువాయి 2లో

## దద్దరిల్లిన కర్రెగుట్టలు..

- ఎదురుకాల్పుల్లో 22 మంది మావోయిస్టుల మృతి
- 18 మృతదేహాల స్వాధీనం
- కొనసాగుతున్న కూంబింగ్

**మే 7, సమయం న్యూస్, వెంకటాపురం:** భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భారీ ఎదురుకాల్పులతో కర్రెగుట్టలు ఎర్రబారాయి. బీజాపూర్ జిల్లా ఊసూరు ఠాణా పరిధిలోని ఈ

తరువాయి 2లో





## యుద్ధం వచ్చినా మేం సిద్ధమే..!

- హైదరాబాద్‌లో 'ఆపరేషన్ అభ్యాస్'
- 12 శాఖల ఆధ్వర్యంలో ఐదు చోట్ల మాక్‌డ్రిల్
- స్వచ్ఛందంగా పాల్గొన్న పౌరులు

**మే 7, సమయం న్యూస్, మెహదీపట్నం,** కాచిగూడ, వెస్ట్‌మారేడ్‌పల్లి, ఐఎస్ సదన్, నాచారం: ప్రజలంతా తమ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఒక్కసారిగా సైరన్ మోగింది. అంతే ఇళ్లలో దీపాలు ఆర్పేశారు. భారీ భవనాల్లో ఉన్నవారంతా సెల్లార్లలోకి పరుగులు తీశారు. యువతీ, యువకులంతా కలిసి వృద్ధులను, పిల్లలను సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. ఇదంతా... పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పౌర సన్నద్ధతపై బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఆపరేషన్ అభ్యాస్'లో భాగంగా జరిగింది. వైమానిక దాడుల అనంతరం ఏర్పడే ప్రతికూల పరిస్థితులు, పౌరుల స్పందన, సురక్షిత ప్రదేశాల గుర్తింపు తదితరాలపై సికింద్రాబాద్, నానల్‌నగర్ (మెహిదీపట్నం), మల్లాపూర్, చంపాపేట, కాచిగూడ రైల్వేస్టేషన్‌లలో నిర్వహించిన సివిల్ డిఫెన్స్ మాక్‌డ్రిల్ విజయవంతమైంది. జీహెచ్ఎంసీ పరిధిలోని కూడళ్లు, అనేక ప్రాంతాల్లో అధికారులు రెండు నిమిషాలపాటు సైరన్ మోగించారు. యుద్ధ సమయంలో పౌరులు పాటించాల్సిన నియమాలను ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రజలకు వివరించారు. ఎత్తైన భవనాలు లక్ష్యంగా దాడులు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను డమ్మీ బాంబులను ఉపయోగించి సూచించారు. సంఘ విద్రోహ శక్తులు ఎత్తైన భవనాల్లోకి చొరబడి కాల్పులు చేసినప్పుడు... అక్కడ ఉన్నవారిని సురక్షితంగా బయటకు తీసుకొస్తున్న దృశ్యాలను ప్రదర్శించారు. మొత్తం 12 శాఖల సమన్వయంతో నిర్వహించిన ఈ

తరువాయి 2లో

## ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొందాం



- అత్యవసర సేవల ఉద్యోగుల సెలవులు రద్దు
- ప్రభుత్వ ఉద్యోగులు అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు
- ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- నేడు సంఘీభావ ర్యాలీ

2లో

## తొలి వారం తెలంగాణ పరిచయం

- 17 నుంచి అసలైన పోటీలు
- క్రీడా నైపుణ్యాలు, అందం, ప్రతిభ, వ్యక్తిత్వం, సామాజిక నిబద్ధతపై పరీక్షలు
- ఇదీ 'మిస్ వరల్డ్' పోటీల తీరూతెన్నూ..

2లో



# ఉగ్రమూకపై రుద్రతాండవం..

(మొదటిపేజీ తరువాయి)

పగలు త్వరగా చల్లారాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అభిప్రాయపడ్డారు. జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ పలు దేశాల ప్రతినిధులకు దాడులకు సంబంధించిన సమాచారం ఇచ్చారు. ఇక దాడులతో ఉక్కిరిబిక్కిరైన పాక్.. భారత్‌లోని పౌరులను లక్ష్యంగా చేసుకుని సరిహద్దుల్లో కాల్పులు జరిపింది. ఈ ఘటనల్లో 13 మంది మరణించారు.

**25 నిమిషాల్లో..**

పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని(పీవోకే) జైషే మహమ్మద్, లష్కరే తయ్యిబా ఉగ్ర స్థావరాలపై మంగళవారం అర్ధరాత్రి దాటాక భారత సైన్యం విరుచుకుపడింది. 1.05 నుంచి 1.30దాకా 25 నిమిషాలపాటు క్షిపణులు, డ్రోన్లతో జరిపిన దాడుల ద్వారా 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. దాడికి సంబంధించిన వివరాలను విదేశాంగశాఖ కార్యదర్శి విక్రం మిస్రీతోపాటు ఆర్మీ సిగ్నల్ కోర్‌కు చెందిన కర్నల్ సోఫియా ఖురేషీ, వైమానిక దళానికి చెందిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ బుధవారం ఉదయం మీడియాకు వివరించారు. చరిత్రలో తొలిసారి సైనిక ఆపరేషన్ వివరాలను మహిళా అధికారులు వెల్లడించడం విశేషం. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ప్రకటనకు అనుగుణంగానే.. పహల్గాం ఉగ్ర దాడి దోషులు, ఉగ్ర స్థావరాల నిర్వాహకులు, వారికి ఆర్థిక సాయం చేసేవారు, స్పాన్సర్ చేసేవారిని లక్ష్యంగా చేసుకున్నామని మిస్రీ తెలిపారు. ఉగ్ర దాడికి పాల్పడిన వారిపై ఎటువంటి చర్యలనూ పాక్ చేపట్టకపోవడంవల్లే ఈ దాడులు చేశామని స్పష్టం చేశారు.

దాడులు చేసిన 15 నిమిషాల తర్వాత రక్షణశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. కొంత సేపటి క్రితం.. భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించిందని, పాక్, పీవోకేల్లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిందని వెల్లడించింది.

* పాక్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడుతుందనే ఉద్దేశంతో గగనతల రక్షణ వ్యవస్థను భారత్ క్రియాశీలం చేసింది. దాడి జరిగిన అనంతరం భారత్ మాతా కీ జై అంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ట్వీట్ చేశారు. న్యాయం జరిగింది.. అంటూ భారత ఆర్మీ ఎక్స్‌లో పోస్టు పెట్టింది.
* ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీకి శిక్షణనిచ్చిన శిబిరాలు ధ్వంసమయ్యాయి.
* గురువారం ఉదయం 11 గంటలకు కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది.
* ప్రధాని మోదీ మూడు దేశాల విదేశీ పర్యటనను వాయిదా వేసుకున్నారు. ఆయన క్రొయేషియా, నార్వే, నెదర్లాండ్స్ పర్యటనలకు వెళ్లాల్సి ఉంది.
* పారామిలిటరీ దళాలకు కేంద్రం సెలవులను రద్దు చేసింది. సెలవులో ఉన్న సిబ్బందిని వెనక్కి రావాలని ఆదేశించింది.
* శ్రీనగర్, జమ్మూ, అమృత్‌సర్, చండీగఢ్, ధర్మశాల, లేహ్ తదితర 25 విమానాశ్రయాలను భారత్ మూసివేసింది. దేశీయంగా 300కు పైగా విమానాలు రద్దయ్యాయి. ఎయిరిండియా, ఇండిగోతోపాటు కొన్ని అంతర్జాతీయ సర్వీసులూ రద్దయ్యాయి.
* కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. సరిహద్దు రాష్ట్రాల సీఎంలు, గవర్నర్లు, డీజీపీలు, ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ భేటీకి జమ్మూ కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరాఖండ్, ఉత్తర్ ప్రదేశ్, బిహార్, సిక్కిం, పశ్చిమ బెంగాల్ సీఎంలు, గవర్నర్లు, అధికారులు హాజరయ్యారు.

దాడులు జరిగిన తర్వాత పాక్ సైన్యం అధికార ప్రతినిధి అహ్మద్ షరీఫ్ మీడియాతో మాట్లాడారు. కోట్లీ, ముజఫరాబాద్, బహావల్‌పుర్‌లలో భారత్ క్షిపణి దాడులు చేసిందని చెప్పారు. భారత్ తన భూభాగంలో నుంచే 6 ప్రాంతాల్లో దాడులు చేసిందని తెలిపారు. ఈ దాడుల్లో 31 మంది మరణించారని, 57 మంది గాయపడ్డారని వెల్లడించారు. బహావల్‌పుర్‌లోని సుభాన్ భవనంపై జరిగిన దాడిలో 13 మంది మరణించారని, 37 మంది గాయపడ్డారని తెలిపారు. ముజఫరాబాద్‌లో బిలాల్ భవనం లక్ష్యంగా దాడి జరిగిందని వెల్లడించారు. ఇక్కడ ముగ్గురు మరణించారని, ఇద్దరు గాయపడ్డారని వివరించారు. కోట్లీలో అబ్బాస్ భవనంపై జరిగిన దాడిలో ఇద్దరు మరణించారని తెలిపారు. మురీద్కేలోని ఉమాల్కురా భవనంపై జరిగిన దాడిలో ముగ్గురు హతమయ్యారని చెప్పారు. సియాల్‌కోట్‌లో ప్రాణ నష్టం జరగలేదని వెల్లడించారు. సరిహద్దుల్లో భారత్ జరిపిన కాల్పుల్లో ఐదుగురు పౌరులు మరణించారని తెలిపారు. నీలం జెలం ప్రాజెక్టును భారత్ లక్ష్యంగా చేసుకుందని, ఇది ప్రమాదకర పరిణామమని వ్యాఖ్యానించారు. భారత్ దాడుల సమయంలో పాక్ గగనతలంలో 57 జాతీయ, అంతర్జాతీయ విమానాలు ఉన్నాయని తెలిపారు.

48 గంటలపాటు పాకిస్థాన్ తన గగనతలాన్ని మూసివేసింది.

దాడుల నేపథ్యంలో బుధవారం భారత దౌత్యవేత్తను విదేశాంగశాఖ కార్యాలయానికి పిలిపించిన పాకిస్థాన్.. తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. దాడుల్లో మహిళలు, పిల్లలు మరణించారని తెలిపింది.

భారత్ దాడుల నేపథ్యంలో పాక్ జాతీయ భద్రతా మండలి సమావేశం ప్రధాని షెహబాజ్ అధ్యక్షతన జరిగింది. ఐరాస ఆర్టికల్ 51 ప్రకారం.. దాడులపై స్పందించే అధికారం తమకు ఉందని సమావేశం స్పష్టం చేసింది. భారత్‌పై ప్రతి దాడులు చేసే అధికారాన్ని పూర్తిగా సైన్యానికి కట్టబెట్టింది.

భారత్ దాడుల్లో 31 మంది మరణించారని, 57 మంది గాయపడ్డారని పాకిస్థాన్ సైన్యం ప్రకటించింది.

బహావల్‌పుర్‌లోని జైషే మహమ్మద్ ప్రధాన కార్యాలయంపై జరిగిన క్షిపణి దాడిలో తన కుటుంబ సభ్యులు 10 మందితోపాటు నలుగురు సహాయకులు మరణించారని ఆ సంస్థ చీఫ్ మౌలానా మసూద్ అజార్ ధ్రువీకరించాడు.

పాకిస్థాన్ స్టాక్ మార్కెట్ కుప్పకూలింది. 3,559 పాయింట్ల దాకా (3.3%) నష్టపోయింది.

భారత్ దాడుల నేపథ్యంలో పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో బుధవారం అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

# స్వదేశాన్ని గాలికొదిలి..భారత్‌పై ద్వేషంతో..!

కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంచి పోషించటం, నిరంతరం కశ్మీర్‌ను రగులుస్తూ ఉంచటం దీని ఉద్దేశం! అప్పటికే అఫ్గానిస్థాన్‌లో అమెరికా సోవియట్ యూనియన్‌తో ప్రచ్ఛన్నయుద్ధం సాగుతోంది. అందులో భాగంగా గెరిల్లా, ఉగ్రవాద ఎత్తుగడల్లో అమెరికా గూఢచారి సంస్థ (సీఐఏ) పాకిస్థాన్ ఐఎస్ఐ సాయం తీసుకుంది. రష్యా దళాలపై ఎక్కుపెట్టడం కోసమని అఫ్గాన్‌లోని ముజాహిదీన్‌లకు అమెరికా ఆయుధాలు ఇచ్చింది. వీటిలో దాదాపు 60 శాతాన్ని పాకిస్థాన్ ఐఎస్ఐ కొట్టేసింది. అంతేగాకుండా... 1989లో అఫ్గాన్ నుంచి రష్యా వెనక్కి వెళ్లినప్పుడు వదిలేసిన ఆయుధాలూ అందుబాటులోకి వచ్చాయి. వీటన్నిటినీ కశ్మీర్‌లో ఉగ్రవాదానికి మళ్లించడం పాకిస్థాన్‌కు సులభమైంది. వీటికి తోడు అఫ్గాన్‌లో మత్తుమందు అక్రమ రవాణా ద్వారా, ఇతర దేశాల్లోని ముస్లింల నుంచి వచ్చిన విరాళాలు, సరిహద్దుల్లో స్మగ్లింగ్ ద్వారా వచ్చిన సొమ్మూ... కశ్మీర్‌లో ఉగ్రవాదం వేళ్లూనుకునేలా చేసింది. ఇదే సమయంలో 1987లో జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన భారీ రిగ్గింగ్, ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వ అవినీతి, అసమర్థతపై ప్రజల్లో అసంతృప్తి... ఆజాదీ నినాదాలు... పాకిస్థాన్‌కు కలిసి వచ్చాయి. స్థానిక కశ్మీరీ యువకులను తనవైపు తిప్పుకోవడం ద్వారా ఉగ్రవాదానికి పాదులు వేసింది. సరిహద్దులు దాటించి వారికి తమ సైనికులతో, అఫ్గాన్ ముజాహిద్దీన్‌లతో శిక్షణ ఇప్పించింది. మరోవైపు... జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్), ఆల్ పార్టీ హురియత్ కాన్ఫరెన్స్‌లాంటి రాజకీయ సంస్థలను కూడా ఏర్పాటు చేసింది. కానీ అవి అనుకున్నంత దూసుకుపోకపోవడంతో... అఫ్గానిస్థాన్, పశ్చిమాసియా, ఆఫ్రికాల నుంచీ కిరాయి విదేశీ ఉగ్రమూకలను రంగంలోకి దించింది. లష్కరేలాంటి కరడుకట్టిన టెర్రరిస్టు సంస్థల ఏర్పాటుతో ఉగ్ర ఉన్మాదాన్ని పెంచింది పాకిస్థాన్!

* **ఏటా ఒక్కో ఉగ్రవాదిపై 10లక్షల డాలర్లు...**

'90ల్లో కశ్మీర్‌లో ఉగ్రవాదుల సంఖ్య 2 వేల నుంచి 5 వేల దాకా ఉండేది. అయితే... 2001 తర్వాత సరిహద్దుల్లో కంచె, ఇతర అధునాతన సెన్సర్ వ్యవస్థల ఏర్పాటుతో మిలిటెంట్ల చొరబాటు కష్టమైంది. దీంతో... కశ్మీర్ కాష్టాన్ని రగులుస్తూ ఉంచడానికి సగటున 250300 మంది ఉగ్రవాదులు అందుబాటులో ఉండేలా పాకిస్థాన్ లక్ష్యంగా పెట్టుకుంది. సౌత్ ఏషియన్ టెర్రరిజం పోర్టల్ (ఎస్ఏపీటీ) ప్రకారం... ఏటా ఒక మిలిటెంట్‌పై పాకిస్థాన్ 10 లక్షల డాలర్లు వెచ్చిస్తోంది.

# యుద్ధం వచ్చినా మేం సిద్ధమే..!

(మొదటిపేజీ తరువాయి)

కసరత్తును కమాండ్ కంట్రోల్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.

సికింద్రాబాద్... కంటోన్మెంట్ మారేడ్‌పల్లిలోని జీహెచ్ఎంసీ మైదానం పరిసరాల్లో ఉదయం దాడి జరిగితే సురక్షిత ప్రాంతాలను వెతుక్కోవడం, రాత్రి జరిగితే దీపాలు, విద్యుత్ ఉపకరణాలను ఆర్పేయడం, కిటికీలు, తలుపులు మూసేయడం వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. ఇందులో 200 మందికిపైగా ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. నాచారంలోని... (sic) 

మల్లాపూర్‌లోని... మైఫ్లవర్ గ్రాండ్ అపార్ట్‌మెంట్ పరిసరాల్లో ఉగ్రమూకలు దాక్కోవడం, విచక్షణా రహితంగా బాంబులను విసరడం, ప్రజలంతా భయంతో పరుగులు తీయడం, ఉగ్రమూకలను సైనికులు మట్టుబెట్టడం వంటి సన్నివేశాలను డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు.

చంపాపేట ట్విన్ టవర్స్‌లో... సైరన్ మోగగానే అపార్ట్‌మెంట్ వాసులు సెల్లార్‌లోకి వెళ్లిపోయారు. కాచిగూడ రైల్వేస్టేషన్ ప్రాంతమంతా... బాంబుల మోతలు, క్షతగాత్రుల హాహాకారాలతో మార్మోగింది. రైల్వే రక్షక దళం, పోలీసులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు సంయుక్తంగా చేపట్టిన కార్యక్రమంలో పౌరులను రక్షించే విధానాన్ని, గాయపడిన వారిని తరలించే తీరును కళ్లకు కట్టినట్లు చూపించారు.

# తొలి వారం తెలంగాణ పరిచయం

హైదరాబాద్: గ్రామీణ పర్యాటకానికి విస్తృత ప్రచారం కల్పించేందుకు 'మిస్ వరల్డ్ 2025' పోటీలను అవకాశంగా మలచుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ గ్రామీణ, సాంస్కృతిక, చారిత్రక, పర్యాటక వైభవాన్ని చాటిచెప్పడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రపంచంలోని 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ పోటీల ఈవెంట్‌లో రాష్ట్రంలోని గ్రామీణ పర్యాటకాన్ని హైలైట్ చేయనున్నారు. మిస్ వరల్డ్ అసలు పోటీలు ఈ నెల 17 నుంచి మొదలుకానున్నాయి. దాదాపు 110 దేశాల నుంచి వస్తున్న అందగత్తెలు తొలి వారమంతా తెలంగాణలో రెండు బృందాలుగా విడిపోయి పర్యటించనున్నారు. మన చారిత్రక కట్టడాలు, సంస్కృతిని వీరికి పరిచయం చేస్తారు. ఆ తర్వాతే అసలుసిసలు పోటీ మొదలవుతుంది. అందాల పోటీల వేడుకల ప్రారంభానికి ఇంకా రెండు రోజుల సమయమే ఉండటంతో వివిధ దేశాల నుంచి మిస్ వరల్డ్ పోటీదారులు హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. మంగళవారం వరకు 28 మంది రాగా.. బుధవారం 40 మందికి పైగా.. కజఖ్‌స్థాన్, సింగపూర్, డెన్మార్క్, కెన్యా, శ్రీలంక, బెల్జియం తదితర దేశాల సుందరీమణులు వచ్చారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలతో వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా స్వాగతం పలికింది. ఈ నెల 10న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రారంభించనున్న నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు పోటీదారులు స్టేడియంలో రిహార్సల్స్ చేస్తారని సమాచారం.

**క్రీడలతో షురూ..**

మిస్ వరల్డ్ స్పోర్ట్స్ ఫైనల్ పోటీలు ఈ నెల 17న గచ్చిబౌలిలో ప్రారంభం కానున్నాయి. ఫిట్‌నెస్, ఆరోగ్యం, సానుకూల దృక్పథం, క్రీడానైపుణ్యాల వంటివి పరీక్షిస్తారు. క్రికెట్, ఫుట్‌బాల్, షూటవుట్, షటిల్ రన్, హాకీ షూటవుట్, 400 మీటర్ల రేస్ వంటి అంశాల్లో పోటీలుంటాయి. ఈ నెల 20, 21 తేదీల్లో టీ హబ్ వేదికగా కాంటినెంటల్ ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఇందులో విజేతలైనవారు ఆయా ఖండాల తరఫున ఫైనల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారు.

శిల్పాకళా వేదిక కేంద్రంగా ఈ నెల 22న టాలెంట్ ఫినాలే ఉంటుంది. పోటీదారుల అందం, ప్రతిభ వంటి అంశాలను పరీక్షిస్తారు. ఈ నెల 23న హెడ్ టు హెడ్ ఛాలెంజ్‌లో 'బ్యూటీ విత్ ఏ పర్పస్' అనే అంశంలో పోటీదారులు సామాజికాంశాలపై తమ నిబద్ధతను న్యాయనిర్ణేతల ముందు ప్రదర్శించనున్నారు. ట్రైడెంట్ హోటల్‌లో ఈ పోటీలు జరుగుతాయి. ఈ నెల 10న ప్రారంభ వేడుక దగ్గర్నుంచి 31న జరిగే ముగింపు వరకు 28 కార్యక్రమాలు నిర్వహిస్తుండగా... పరిమితంగా మాత్రమే సామాన్యులు పాల్గొనే అవకాశం ఉంది. గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభ వేడుక, ఇండోర్ స్టేడియంలో జరిగే క్రీడా పోటీలకు హాజరు కావొచ్చు. 24న హైటెక్స్‌లో జరిగే జ్యూయలరీ ఫ్యాషన్ షోను వీక్షించేందుకు సామాన్యులకు అవకాశం ఉంటుందని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

## ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొందాం

''హైదరాబాద్‌లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర కట్టుదిట్టమైన భద్రత చేపట్టాలి. ఐటీ సంస్థల దగ్గర పటిష్ఠ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయండి. పాత నేరస్థులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. వారి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించండి. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సర్వ సన్నద్ధంగా ఉండాలి. హైదరాబాద్ నగరంలో పోలీసుల అప్రమత్తత చాలా ముఖ్యం. అవసరమైతే శాంతి కమిటీలతో మాట్లాడండి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. ''మనమంతా దేశ సైన్యంతో ఉన్నామనే సందేశం ఇవ్వాలి. ఈ సమయంలో రాజకీయాలకు, పార్టీలకు తావు లేదు. మంత్రులు, అధికారులు, ఉద్యోగులందరూ అందుబాటులో ఉండాలి. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలి. అత్యవసర సర్వీస్‌లు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులు రద్దు చేయండి. మీడియా, సోషల్ మీడియాలో ప్రభుత్వ ఉద్యోగులు అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు చేపట్టండి'' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దేశ రక్షణలో హైదరాబాద్ వ్యూహాత్మక ప్రాంతంగా, డిఫెన్స్ విభాగాలకు స్థావరంగా ఉన్నందున.. తాజా పరిస్థితులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా అన్ని విభాగాలకు దిశానిర్దేశం చేశారు. మాక్ డ్రిల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. ''ఎవరూ భయభ్రాంతులకు గురికావద్దు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏవైనా అనుమానాలుంటే వెంటనే పోలీసు విభాగానికి ఫిర్యాదు చేయండి. వైద్యం, పౌరసరఫరాలు, విద్యుత్ వంటి అత్యవసర సేవలు అందించే విభాగాలు 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబరు ఇవ్వాలి. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా వచ్చి నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోండి. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించండి.

**ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ పెట్టండి**

ఫేక్ న్యూస్, వదంతులు ప్రచారం చేసే వారిపైన ఉక్కు పాదం మోపండి. వారిపట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలి. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయండి. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు.. సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి. ఆయా ప్రాంతాల్లో భద్రతను పెంచాలి'' అని ముఖ్యమంత్రి ఆదేశించారు. అక్కడి నుంచి బయటకు వచ్చిన సీఎం... బయట ఎండలో ఉన్న పాత్రికేయులను చూసి కాన్వాయ్‌ను ఆపారు. జర్నలిస్టులతో కాసేపు మాట్లాడారు. ''ఆపరేషన్ సిందూర్‌ను చూసి ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. ప్రతి భారతీయుడు ఆర్మీకి బాసటగా నిలవాలి. సీఎంగా నా బాధ్యత నిర్వర్తిస్తున్నా. రాజకీయాలు కాదు.. దేశం ముందు. దేశంలోకి వచ్చి చంపుతుంటే చూస్తూ ఊరుకుంటే ఎలా? అన్ని విభాగాలను అప్రమత్తం చేశాం'' అని వివరించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, హోంశాఖ కార్యదర్శి రవిగుప్తా, ఇతర పోలీసు, స్థానిక మిలిటరీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకూ జరగనున్న ఈ ర్యాలీలో సీఎంతో పాటు మంత్రులు, ఉన్నతాధికారులు, పలువురు నేతలు పాల్గొంటారు.

## దద్దరిల్లిన కర్రెగుట్టలు

(మొదటిపేజీ తరువాయి)

గుట్టల్లో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో 22 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయి, హోంమంత్రి విజయశర్మ ఈ ఎదురుకాల్పుల ఘటనను ధ్రువీకరించారు. డ్రోన్ కెమెరాలు, వైమానిక దళ హెలికాప్టర్లు, ఇతర అత్యాధునిక సాంకేతికతతో మావోయిస్టుల కదలికలను గుర్తించి.. బలగాలు కూంబింగ్ చేపడుతున్నాయి. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇప్పటివరకు 18 మంది మావోయిస్టుల మృతదేహాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. భీకర ఆపరేషన్ కొనసాగుతోందని వెల్లడించారు. దిల్లీ నుంచి సీఆర్పీఎఫ్ డీజీ జ్ఞానేంద్ర ప్రతాప్‌సింగ్, ఛత్తీస్‌గఢ్ నక్సల్స్ ఆపరేషన్ ఏడీజీ వివేకానంద సిన్హా, బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఆ ప్రాంతంలో భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్, తెలంగాణలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దుల్లో విస్తరించిన కర్రెగుట్టల ప్రాంతంలో గత నెల 22న ప్రారంభమైన ఆపరేషన్ 16 రోజులుగా నిరంతరాయంగా కొనసాగుతోంది. ఇక్కడ రెండు రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్లో ఓ మహిళా మావోయిస్టు మృతి చెందగా.. గత నెల 24న ఎదురుకాల్పుల్లో ముగ్గురు పీఎల్‌జీఏ సభ్యులు మృతి చెందిన సంగతి తెలిసిందే. లొంగిపోవడం మినహా మావోయిస్టులకు మరో మార్గం లేదని ఐజీ సుందర్‌రాజ్ మరోసారి స్పష్టం చేశారు. కర్రెగుట్టల్లోని దోబే, నీలంసాయి, డోలి, తడపలలో తాత్కాలిక బేస్ క్యాంపులను ఏర్పాటు చేసిన భద్రతా బలగాలు.. కీలకమైన మరో కొండ ప్రాంతాన్ని అధీనంలోకి తెచ్చుకునేందుకు అడుగులు వేస్తున్నాయి. కర్రెగుట్టల్లో ఆపరేషన్‌లో చిత్రీకరించిన వీడియోల్లో తొలిసారి హెవీ మెషీన్ గన్ (హెచ్ఎంజీ)ను గుర్తించినట్లు తెలిసింది.

## ఓఎంసీ కేసులో... ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి చుక్కెదురు

దిల్లీ: ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసుకు సంబంధించి ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. కేసు నుంచి ఆమెకు విముక్తి కల్పిస్తూ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూరు సుమలత నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం 2022లో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టేసింది. శ్రీలక్ష్మి దాఖలుచేసిన డిశ్చార్జి పిటిషన్‌లో హైకోర్టు ఏకపక్షంగా తీర్పును వెలువరించినట్లు సీబీఐ చేసిన వాదనలను పరిగణనలోకి ఈ నిర్ణయం వెలువరించింది. శ్రీలక్ష్మి పిటిషన్‌ను హైకోర్టు మళ్లీ విచారించి, మెరిట్స్ ప్రాతిపదికన నిర్ణయం వెలువరించాలని ఆదేశించింది. ఇందుకోసం మూడు నెలల గడువు విధించింది. ఈ మేరకు జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ రాజేష్‌బిందల్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

**సీబీఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్..**

ఓఎంసీ అక్రమ మైనింగ్ కేసులో సీబీఐ సమర్పించిన ఛార్జిషీట్‌లో తన పేరు లేకున్నా, ఆ తర్వాత అనుబంధ ఛార్జిషీట్‌లో 6వ నిందితురాలిగా చేర్చడాన్ని సవాల్‌చేస్తూ శ్రీలక్ష్మి హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్ వేశారు. 2006 మే 17 నుంచి 2009 అక్టోబరు 10 వరకు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో తాను అధికార దుర్వినియోగానికి పాల్పడి కుట్రపూరితంగా ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి రెండు మైనింగ్ లీజులు కట్టబెట్టినట్లు సీబీఐ మోపిన అభియోగాలను ఆమె అందులో సవాలు చేశారు. శ్రీలక్ష్మి ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ నిందితులకు అక్రమంగా మైనింగ్ లీజులు ఇవ్వడానికి సహకరించి విశ్వాసఘాతుకానికి పాల్పడటంతోపాటు, ప్రభుత్వాన్ని మోసం చేశారని సీబీఐ చేసిన వాదనలను పరిగణనలోకి తీసుకొని కోర్టు ఆమె డిశ్చార్జి పిటిషన్‌ను 2022 అక్టోబరు 17న కొట్టేసింది.



# ఎల్లారెడ్డి పేట.. విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తొగుట మే 7 (సమయం న్యూస్) : తొగుట మండలం ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000 2001లో చదువుకున్న 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులంతా బుధవారం సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులంతా ఒకచోట కలుసుకొని సరదాగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వారంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మెమెంటోలు, శాలువాలచే ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు సోమ గారి నాగిరెడ్డి, మధుసూదన్ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వరదరాజపూర్ సాక్షాత్ కంచియే.. మళ్లీ విశ్వగురువుగా మారనున్న భారత్

* సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం వరదరాజపూర్ లో వరదరాజస్వామి యంత్ర పునప్రతిష్ట
* హాజరైన త్రిదండి చిన్న జీయర్ స్వామి, ఎంపీ ఈటల రాజేందర్
* నేడు విగ్రహ ప్రతిష్ట



గజ్వేల్, మే 7: వరదరాజపూర్ లో కొలువైన వరదరాజస్వామి సాక్షాత్ కంచిలో కొలువైన వరదరాజస్వామి అని త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం వరదరాజపూర్ గ్రామంలో ప్రభుత్వం పునర్నిర్మించిన వరద రాజస్వామి ఆలయంలో త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా యంత్ర ప్రతిష్టజరిగింది.కార్యక్రమంలోమల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో వారు ప్రసంగించారు. కంచి వరదరాజస్వామిని నిత్యం పూజించుకోలేక బాధపడుతున్న ఆనాటి కొందరు భక్తులు ఆ ప్రాంతం నుంచి వరదరాజ స్వామి విగ్రహాలను తీసుకొస్తున్న క్రమంలో వరదరాజ పూర్ గ్రామంలో సేద తీరారని ఇక్కడ భూమిపై పెట్టిన విగ్రహాలు ఎంతకు కదలకపోవడంతో ఇక్కడే స్వామివారి ఆలయాన్ని నిర్మించారని చిన్న జీయర్ స్వామి తెలిపారు. వరదరాజ పూర్ లో ఉన్నది సాక్షాత్తు కంచి వరదరాజస్వామియేనని వెల్లడించారు. పూర్తిగా అక్కడి ఆలయం లాగే ఇక్కడి వరదరాజస్వామి ఆలయాన్ని నిర్మించుకోవడం అద్భుతమని, ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరు అభినంద నీయులే అన్నారు. ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ చిన్న జీయర్ స్వామి లాంటి ఎందరో మహానుభావుల ఆధ్వర్యంలో సనాతన సంప్రదాయం ప్రపంచవ్యాప్తంగా వెల్లివిరుస్తుందన్నారు. అమెరికా అరబ్లాంటి అభివృద్ధి చెందిన దేశాల ప్రజలు కూడా భారతీయ సాంప్రదాయాన్ని ఇష్టపడుతున్నారని చెప్పారు. భారత సంప్రదాయాన్ని వారంతా పాటిస్తూ ఎంతో ప్రశాంతతను పొందుతున్నారన్నారు. ప్రభుత్వాలు ప్రజా ప్రతినిధుల వల్ల ప్రశాంతత లభించదని, సనాతన సాంప్రదాయాన్ని సమాజంలో వెదజల్లుతున్న ఆలయాలలోనే ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రాచీన కాలంలో ప్రపంచానికి వివిధ శాస్త్రాలను బోధించి విశ్వ గురువుగా పేరుపొందిన భారతదేశం మళ్లీ విశ్వ గురువుగా త్వరలోనే మారనుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, అధికారులు, వేద పండితులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# సీఎం సహాయ నిధి పేదలకు వరం NSUI తోగుట మండల అధ్యక్షులు ప్రవీణ్

తోగుట మండలం ఎట్టిగడ్డ కిష్టాపూర్ ( R&R ) గ్రామానికి చెందిన గుమ్ముల రాజయ్య కి దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సహకారం తో మంజూరైన అరవై వేల రూపాయల చెక్కును తొగుట మండల ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు ప్రవీణ్ అందజేశారు . మంజూరు చేయించి ఆదుకున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి కి రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు.

# కార్మిక సంక్షేమం సీఐటీయూ తోనే సాధ్యం

- ప్రజ్ఞాపూర్ రాణే పరిశ్రమలో వరుస గా 4వ సారి విజయం
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



గజ్వేల్, మే 7: కార్మిక సంక్షేమం కేవలం సిఐటియు తోనే సాధ్యమవుతుందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, రాణే పరిశ్రమ కార్మిక యూనియన్ గౌరవాధ్యక్షులు చుక్కా రాములు అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని రాణె బ్రేక్ లైనింగ్ పరిశ్రమ లో బుధవారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బిఎంఎస్ పై 34 ఓట్ల మెజారిటీతో సిఐటియు విజయం సాధించిందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు యూనియన్ గౌరవాధ్యక్షులు చుక్కా రాములు, యూనియన్ అధ్యక్షులు సిఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ తెలిపారు. పరిశ్రమలో 155 ఓట్లు ఉండగా సిఐటియు 94ఓట్లు రాగా, బి ఎం ఎస్ కు 60.ఓట్లు పోల్ అయ్యాయి . 34 ఓట్ల మెజారిటీతో సిఐటియు విజయం సాధించింది. బిఎంఎస్ కార్మిక సంఘం నుండి జాతీయ ఉపధ్యక్షులు మల్లేశం పోటీ చేయగా, సిఐటియు నుండి యూనియన్ గౌరవ అధ్యక్షులుగా చుక్కా రాములు, అధ్యక్షులుగా మల్లికార్జున్ పోటీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియూ రాష్ట్ర అధ్యక్షులు యూనియన్ గౌరవ అధ్యక్షులు చుక్కా రాములు, యూనియన్ అధ్యక్షులు జె మల్లికార్జున మాట్లాడుతూ ఇది కార్మికుల విజయమని కార్మికులు సిఐటియును నమ్ముకొని నాలుగోసారి గెలిపించినందుకు ధన్యవాదములు తెలిపారు. కార్మికులకు హామీ ఇచ్చినట్లుగా మెరుగైన వేతన ఒప్పందం తో పాటు, మరిన్ని మంచి సంక్షేమ పథకాలు, పరిశ్రమలో కార్మికుల రిటైర్మెంట్ 60 సంవత్సరాలకు పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. బిఎంఎస్ కల్లబొల్లి మాటలు చెబుతూ తప్పుడు ప్రచారాలు చేసిన కార్మికుల నమ్మలేదన్నారు సిఐటియూ ద్వారానే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని కార్మికులు మరోసారి రుజువు చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో మే 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గెలిచిన అనంతరం కార్మికులందరూ నాయకులను సత్కరించి టపాకాయలు కాల్చి, సీట్లు పంచుకొని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం రాణి బ్రేక్ లైనింగ్ పరిశ్రమ నుండి గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సందబోయిన ఎల్లయ్య, కామని గోపాలస్వామి, యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, , ఉప ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షపతి, చంద్రశేఖర్ రెడ్డి నర్సింలు, సాజిద్, వెంకట్రావు, శ్రీనివాస్, రంగారెడ్డి, రాజగోపాల్, స్వామి, మరాటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# గజ్వేల్ అభివృద్ధికి పెద్దపీట

* మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్ మే 7: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో అవసరమైన నిధులు సాధిస్తున్నట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ లోని ఢిల్లీ వాలా హోటల్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ పేద ప్రజలను కలవడం కష్టంగా మారిందని, దీంతో అసంపూర్తి దశలో నిలిచిపోయిన అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. త్వరలోనే రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ పాపాలు, నాయకుల స్వార్థం ఫలితంగా ఇండ్లు కేటాయించినప్పటికీ అప్పగించలేదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కమిషన్ల కోసమే నిర్మాణాలు చేపట్టగా, ప్రయాణికులకు అందుబాటులో లేకుండా బస్టాండ్ నిర్మాణం చేపట్టి వృధాగా వదిలేసినట్లు తెలిపారు. అంతేకాకుండా గజ్వేల్, ప్రజ్ఞాపూర్ బస్టాండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. నిర్మాణాల్లో నాసిరకం పనులు చేపట్టడంతో పదేళ్లు కాకుండానే పగుళ్లు ఏర్పడుతుండగా, చిన్నపాటి వర్షానికి సమీకృత భవనంలో నీరు నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ సహకరించనప్పటికీ ప్రభుత్వ అనుమతితో పెండింగ్ లో ఉన్న 800లకు పైగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. గజ్వేల్ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని, అసంపూర్తి దశలో ఉన్న పనుల కోసం నిధుల మంజూరీకి ప్రతిపాదనలు సిద్ధం చేసి సీఎం రేవంత్ రెడ్డికి దృష్టికి తెచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సుఖేందర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు మొనగారి రాజు, రాములు గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి, యాదగిరి, నేతలు సమీర్, సుభాష్ చంద్రబోస్, రామచంద్ర చారి, జంగం రమేష్ గౌడ్, ఆజ్గర్, సబ్బని నరేష్, అజ్గర్, చెప్పాల శేఖర్, సురేష్, ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి అక్రమార్కులపై ధైర్యంగా సమాచారం ఇవ్వండి

* సింగరేణిలో అవినీతి దందాలపై ఉక్కు పాదం
* ఎంతటి వారైనా ఉపేక్షించే సమస్యే లేదు
* మోసగాళ్ల సమాచారాన్ని సింగరేణి విజిలెన్స్ ఏసీబీకి అందించండి
* సమాచారం ఇచ్చిన వారికి పూర్తి రక్షణ వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం
* ఆధారాలతో అక్రమార్కులను పట్టించిన వారికి రూ.10 వేల పారితోషకం
* సింగరేణి ఉద్యోగులకు యాజమాన్యం పిలుపు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 7(సమయం న్యూస్): శ్రమకు మారుపేరుగా నిలుస్తూ దేశానికి వెలుగులు అందిస్తున్న సింగరేణి సంస్థలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కొన్ని అరాచక శక్తులను ఇప్పటికే ఏరివేయడం జరిగిందని ఇంకా ఇటువంటి అవినీతి దందాలు నడిపే వారికి సంబంధించిన వెనక ఉండి నడిపిస్తున్న వారి సమాచారం తెలియజేస్తే వారిని కూడా ఉక్కుపాదంతో అణిచివేస్తామని సింగరేణి యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. మెడికల్ బోర్డు ప్రక్రియలో అన్ ఫిట్ చేయిస్తామని బదిలీలు జరిపిస్తామని కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన వారిని వైద్య పరీక్షల్లో ఫిట్ చేయిస్తామని డిప్యూటేషన్లు ఇంటర్నల్ ఎక్స్ టర్నల్ పరీక్షల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సింగరేణి ఉద్యోగిని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో సంస్థ ఈ ప్రకటన జారీ చేసింది. అమాయకులైన కార్మికులను వంచిస్తున్న ఎవరినైనా సరే సంస్థ ఉపేక్షించబోదని కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. అవినీతి చర్యలకు పాల్పడే వారిని వారికి వెనుక ఉండి సహకారం అందించే వారిని సైతం వదిలిపెట్టే ప్రసక్తే లేదని యాజమాన్యం హెచ్చరించింది. అవినీతికి బలైన బాధితులు లేదా దీనిపై సమాచారం ఉన్నఏ ఇతర కార్మికులైన ఇతరులైన సరే సింగరేణి విజిలెన్స్ శాఖకు తెలియజేయవచ్చని ఫిర్యాదుదారుల పేర్లను గోప్యంగా ఉంచడమే కాక వారికి సంస్థ పూర్తి రక్షణ కల్పిస్తుందని యాజమాన్యం పేర్కొంది. అలాగే సింగరేణి సంస్థలో వివిధ పనులు చేయిస్తామని పేరుతో మోసాలకు పాల్పడుతున్న వారి వివరాలు, ఆధారాలు ఇచ్చిన వారికి రూ.10 వేల పారితోషకం కూడా ఇవ్వనున్నట్లు పునరుద్ఘాటించింది. అదే సమయంలో సింగరేణి కార్మికులు తప్పుడు వ్యక్తుల సోపతి పట్టి వక్రమార్గాల్లో పయనించి ఉద్యోగ జీవితాన్ని పాడుచేసుకోవద్దని ప్రలోభ పెట్టే వారిని దగ్గరకు రానియొద్దని హితవు పలికింది. ఏరియాల్లో గనుల్లో డిపార్ట్ మెంట్ ల్లో సింగరేణి ఉద్యోగులు లేదా అధికారులు లేక బయట వ్యక్తులు ఎవరైనా సరే లంచాలు ఆశిస్తున్నట్లయితే వారి వివరాలను విజిలెన్స్ శాఖకు ఏసీబీకి అందించి పట్టించాలని యాజమాన్యం సూచించింది. అవినీతిని అక్రమాలను కూకటివేళ్లతో పెకిలించడానికి సదరు వ్యక్తులను కటకటాల వెనక్కి నెట్టడానికి సింగరేణి యాజమాన్యం సంసిద్ధంగా ఉందని సంస్థ పట్ల బాధ్యత గల కార్మికులు ఇందుకు సహకరించాలని సమాచారం అందించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. అవినీతి అక్రమాలకు పాల్పడే వ్యక్తులు ఎవరైనా సరే, ఏ హోదాలో ఉన్న వదిలిపెట్టేది లేదని యాజమాన్యం స్పష్టం చేసింది. గతంలోనూ సింగరేణిలో అక్రమాలకు పాల్పడిన పలువురు ఉద్యోగులపై విచారణ జరిపి డిస్మిస్ చేసిన విషయాన్ని గుర్తుచేసింది. చట్టప్రకారం పలువురిపై చర్యలు కూడా తీసుకున్నట్లు వెల్లడించింది. ఇకముందు కూడా పారదర్శక సింగరేణి కోసం అక్రమార్కులపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసింది. సింగరేణి సంస్థను అవినీతి రహిత కంపెనీగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు సహకరించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. అవినీతిపరులపై ఫిర్యాదు చేసేందుకు కొత్తగూడెం విజిలెన్స్ శాఖ వారి ఫోన్ నెంబర్ 94911 44104 కు గాని విజిలెన్స్ శాఖ మెయిల్ ఐడి vig@ scclmines.com కు సమాచారం ఇవ్వాలని యాజమాన్యం సూచించింది.

# బొగ్గు గని కార్మికులకు డ్రెస్ కోడ్ కు 12,500 చెల్లింపు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 07 సమయం న్యూస్: బొగ్గు గని కార్మికుల డ్రెస్ కోడ్ కొరకు ప్రతి సంవత్సరం 12, 500 రూపాయలు చెల్లించేందుకు కోలిండియా యాజమాన్యం ఆమోదించిందని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం (బిఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం నిర్వహించిన అపెక్స్ జెసిసి సమావేశానికి సిఐఎల్ చైర్మన్ పిఎం ప్రసాద్ అధ్యక్షత వహించగా, ఈ సమావేశంలో జాతీయ కార్మిక సంఘాలైన బిఎంఎస్, సిఐటియు, ఏఐటియుసి, హెచ్ఎంఎస్ ప్రతినిధులు పాల్గొనగా, బిఎంఎస్ నుండి బిఎంఎస్ జాతీయ నాయకుడు, బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి హాజరయ్యారని తెలిపారు. అపెక్స్ కమిటీ సమావేశంలో ప్రతి సంవత్సరం ప్రతి కార్మికునికి మూడు డ్రెస్సులు అందజేయడానికి 12,500 చెల్లించేందుకు కోలిండియా యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. అపెక్స్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని సింగరేణిలో సైతం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సంస్థాగత మద్దతు

* **జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రవి కిరణ్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 07 సమయం న్యూస్: జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంస్థాగత మద్దతు బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రవి కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ బ్యాంకు మద్దతుతో ఎంఎస్ఎం ఈ క్రింద తెలంగాణ ప్రభుత్వం అన్ని జిల్లాలలోని జిల్లా పరిశ్రమల కేంద్రాలలో ఎంటర్ప్రైజెస్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తుందని, తద్వారా మార్కెట్ యాక్సిస్, క్రెడిట్ లభ్యత, పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు సేవలను అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హత, అనుభవం కలిగిన వ్యక్తుల నుండి ఒక మేనేజర్, ఒక అసిస్టెంట్ మేనేజర్ లను ప్రతి జిల్లాకు నియమించేందుకు దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. మేనేజ్మెంట్, కామర్స్, ఇంజనీరింగ్ నేపథ్యంలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కు ప్రాధాన్యత ఉంటుందని, అర్హత, ఆసక్తి గలవారు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆన్లైన్లో www.nimsme.gov.in వెబ్ సైట్ లో, జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎస్ 25 లో గల జిల్లా పరిశ్రమల కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు.

# అవినీతి అక్రమార్కులపై ధైర్యంగా సమాచారం ఇవ్వండి

* **సింగరేణిలో అవినీతి దందాలపై ఉక్కు పాదం**
* **ఎంతటి వారైనా ఉపేక్షించే సమస్యే లేదు**
* **మోసగాళ్ల సమాచారాన్ని సింగరేణి విజిలెన్స్ ఏసీబీకి అందించండి**
* **సమాచారం ఇచ్చిన వారికి పూర్తి రక్షణ వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం**
* **ఆధారాలతో అక్రమార్కులను పట్టించిన వారికి రూ.10 వేల పారితోషకం**
* **సింగరేణి ఉద్యోగులకు యాజమాన్యం పిలుపు**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 7(సమయం న్యూస్): శ్రమకు మారు పేరుగా నిలుస్తూ దేశానికి వెలుగులు అందిస్తున్న సింగరేణి సంస్థలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కొన్ని అరాచక శక్తులను ఇప్పటికే ఏరివేయడం జరిగిందని ఇంకా ఇటువంటి అవినీతి దందాలు నడిపే వారికి సంబంధించిన వెనక ఉండి నడిపిస్తున్న వారి సమాచారం తెలియజేస్తే వారిని కూడా ఉక్కుపాదంతో అణిచివేస్తామని సింగరేణి యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. మెడికల్ బోర్డు ప్రక్రియలో అన్ ఫిట్ చేయిస్తామని బదిలీలు జరిపిస్తామని కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన వారిని వైద్య పరీక్షల్లో ఫిట్ చేయిస్తామని డిప్యూటేషన్లు ఇంటర్నల్ ఎక్స్ టర్నల్ పరీక్షల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సింగరేణి ఉద్యోగిని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో సంస్థ ఈ ప్రకటన జారీ చేసింది. అమాయకులైన కార్మికులను వంచిస్తున్న ఎవరినైనా సరే సంస్థ ఉపేక్షించబోదని కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. అవినీతి చర్యలకు పాల్పడే వారిని వారికి వెనుక ఉండి సహకారం అందించే వారిని సైతం వదిలిపెట్టే ప్రసక్తే లేదని యాజమాన్యం హెచ్చరించింది. అవినీతికి బలైన బాధితులు లేదా దీనిపై సమాచారం ఉన్న ఏ ఇతర కార్మికులైన ఇతరులైన సరే సింగరేణి విజిలెన్స్ శాఖకు తెలియజేయవచ్చని ఫిర్యాదుదారుల పేర్లను గోప్యంగా ఉంచడమే కాక వారికి సంస్థ పూర్తి రక్షణ కల్పిస్తుందని యాజమాన్యం పేర్కొంది. అలాగే సింగరేణి సంస్థలో వివిధ పనులు చేయిస్తామని పేరుతో మోసాలకు పాల్పడుతున్న వారి వివరాలు, ఆధారాలు ఇచ్చిన వారికి రూ.10 వేల పారితోషకం కూడా ఇవ్వనున్నట్లు పునరుద్ఘాటించింది. అదే సమయంలో సింగరేణి కార్మికులు తప్పుడు వ్యక్తుల సోపతి పట్టి వక్రమార్గాల్లో పయనించి ఉద్యోగ జీవితాన్ని పాడుచేసుకోవద్దని ప్రలోభ పెట్టే వారిని దగ్గరకు రానియొద్దని హితవు పలికింది. ఏరియాల్లో గనుల్లో డిపార్ట్ మెంట్ ల్లో సింగరేణి ఉద్యోగులు లేదా అధికారులు లేక బయట వ్యక్తులు ఎవరైనా సరే లంచాలు ఆశిస్తున్నట్లయితే వారి వివరాలను విజిలెన్స్ శాఖకు ఏసీబీకి అందించి పట్టించాలని యాజమాన్యం సూచించింది. అవినీతిని అక్రమాలను కూకటివేళ్లతో పెకిలించడానికి సదరు వ్యక్తులను కటకటాల వెనక్కి నెట్టడానికి సింగరేణి యాజమాన్యం సంసిద్ధంగా ఉందని సంస్థ పట్ల బాధ్యత గల కార్మికులు ఇందుకు సహకరించాలని సమాచారం అందించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. అవినీతి అక్రమాలకు పాల్పడే వ్యక్తులు ఎవరైనా సరే, ఏ హోదాలో ఉన్న వదిలిపెట్టేది లేదని యాజమాన్యం స్పష్టం చేసింది. గతంలోనూ సింగరేణిలో అక్రమాలకు పాల్పడిన పలువురు ఉద్యోగులపై విచారణ జరిపి డిస్మిస్ చేసిన విషయాన్ని గుర్తు చేసింది. చట్టప్రకారం పలువురిపై చర్యలు కూడా తీసుకున్నట్లు వెల్లడించింది. ఇకముందు కూడా పారదర్శక సింగరేణి కోసం అక్రమార్కులపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసింది. సింగరేణి సంస్థను అవినీతి రహిత కంపెనీగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు సహకరించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. అవినీతిపరులపై ఫిర్యాదు చేసేందుకు కొత్తగూడెం విజిలెన్స్ శాఖ వారి ఫోన్ నెంబర్ 94911 44104 కు గాని విజిలెన్స్ శాఖ మెయిల్ ఐడి vig@sccImines.com కు సమాచారం ఇవ్వాలని యాజమాన్యం సూచించింది.




# మహిళలకు రక్షణ కల్పించడమే షీ టీం కర్తవ్యం

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 07 సమయం న్యూస్: ఆకతాయిల ఆట కట్టించి, మహిళలకు రక్షణ కల్పించడమే షీ టీం కర్తవ్యమని షీ టీం సభ్యులు తెలిపారు. బుధవారం జిల్లాలోని సిసిసి నస్పూర్ పట్టణంలోని వెంకటేశ్వర్ల ఆలయ ప్రాంగణంలోని శ్రీనిధి నృత్య శిక్షణ శిబిరంలో విద్యార్థులకు షీ టీం ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వారి పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలపాలని సూచించారు. ఈ సందర్భంగా వారికి సైబర్ నేరాల గురించి అవగాహన కల్పిస్తూ, మహిళలు ఎదైనా సమస్య వస్తే, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. వచ్చిన ఫిర్యాదు పై తక్షణమే షీ టీం పోలీసులు స్పందించి, సంబంధిత విభాగాలకు సమాచార అందజేయడం ద్వారా ఫిర్యాదు చేసిన మహిళకు షీ టీం బృందాలు సహాయం చేస్తాయని తెలిపారు. ఆకతాయిల నుండి మరీ ఇతర వేధింపులకు గురవుతున్న మహిళలు ఫిర్యాదు చేయాలంటే షీ టీం నెంబర్ 6303923700 ను సంప్రదించాలని, అదేవిధంగా అత్యవసర సమయంలో డల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి వృత్యాలయం వ్యవస్థాపకురాలు, నృత్య గురువు కాపుడి వసుధ, షీ టీం సభ్యులు జ్యోతి, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

## కల్తీ కల్లు, మాదక ద్రవ్యాల వలన

# యువత భవిష్యత్తు ప్రమాదం, బోధన్‌లో అవగాహన ర్యాలీ




బోధన్ పట్టణం, మే 7, సమయం న్యూస్ : యువత కల్తీ కల్లు, మాదకద్రవ్యాల వినియోగం వలన జీవితం నాశనమవుతోందని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారి సుబ్బరామిరెడ్డి హెచ్చరించారు. బోధన్ పట్టణంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ, తక్కువ డబ్బులతో ఎక్కువ కిక్కు వస్తుందనే ఆశతో యువత కల్తీ కల్లు, గంజాయి వంటి మాదకద్రవ్యాలను ఉపయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆరోగ్య సమస్యలు, కుటుంబాల నుంచి దూరం అవటం వంటి పరిణామాలు వస్తున్నాయని వివరించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ, రోజువారి కూలీలు, నిరుపేదలు ఈ రకాల పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజల్లో మాధ్యమాల ద్వారా విస్తృత అవగాహన కల్పించేందుకు అన్ని శాఖల సమన్వయం అవసరమని తెలిపారు. సంపాదన కోసం కల్తీ కళ్ళు తయారు చేసే అమ్ముతుంటే తెలంగాణ యాంటీనార్కటిక్ బ్యూరో 1908 కి సమాచారం అందించాలని లేదా 100 కి సమాచారం అందించాలని వారి పైన చట్టపడిన చర్యలు తీసుకుంటామని సమాచారం ఇచ్చిన వారి జాబితా గోప్యంగా ఉంచబడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ సీఐ వెంకటనారాయణ, ఎక్సైజ్ సీఐ భాస్కరరావు, ఎస్సైలు హబీబ్ ఖాన్, భాస్కరాచారి, ఐసీడీఎస్ అధికారి పద్మ, విద్యావికాస్ సంస్థల కరస్పాండెంట్ యార్లగడ్డ శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు ప్రతాప్ గుప్తా, పబ్బమురళి, పలువురు యువత, డ్రైవర్లు, కార్మికులు పాల్గొన్నారు.



# బోధన్ ఎంఐఎం పట్టణ అధ్యక్షుడిగా మీర్ ఇలియాస్ అలీ నియామకం

బోధన్ పట్టణం, మే 7, సమయం న్యూస్ : బోధన్ పట్టణ ఏఐఎంఐఎం (ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తెహాదుల్ ముస్లిమీన్) అధ్యక్షుడిగా మీర్ ఇలియాస్ అలీను అధికారికంగా నియమించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఎంఐఎం పార్టీ అధినేతలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన కమిటీ సభ్యులను కూడా ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ బిన్ మోసిన్, కోశాధికారిగా ఖదీర్ ఖాన్, సంయుక్త కార్యదర్శులుగా అఖిల్ ఫారూకీ, హాజీ బిల్డర్‌లను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా షేక్ సలాం ఛావుస్, మహమ్మద్ ఒమేర్, షేక్ అథర్, షేక్ అయుబ్, మహమ్మద్ అల్తాఫ్, సమీర్ హుస్సేన్, సయ్యద్ సల్మాన్ అతర్, అబ్దుల్ రషీద్ అహ్మద్, రాశేద్ లు ఎంపికయ్యారు. నూతన కమిటీకి న్యాయ సలహాదారుగా న్యాయవాది వాజిద్ హుస్సేన్‌ను నియమించారు. ఈ సందర్భంగా మీర్ ఇలియాస్ అలీ మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, బాధ్యతల్ని నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ, మండల స్థాయి ఎంఐఎం పార్టీ ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

# గురునానక్ యూనివర్సిటీ కార్యాలయాన్ని సీజ్ చేయాలి



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 07 సమయం న్యూస్: జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తా సమీపంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నగరపాలక సంస్థ, తదితర ఎలాంటి అనుమతి లేకుండా కార్యాలయం ఏర్పాటు చేసిన గురునానక్ యూనివర్సిటీ యజమాన్యం పై చట్టపరమైన చర్యలు తీసుకొని, కార్యాలయాన్ని సీజ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన మంచిర్యాల నగరపాలక సంస్థ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో గురునానక్ యూనివర్సిటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేట్, కార్పొరేట్ కళాశాల విద్యార్థుల సమాచారం సేకరించి, టెలికాలర్లను నియమించుకొని, విద్యార్థులను వారి తల్లిదండ్రులకు ఫోన్ చేస్తూ, వారిని మభ్యపెడుతూ, మార్కెటింగ్ దందాను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. పిఆర్‌వో లను నియమించుకొని, అడ్మిషన్లకు తిప్పుతూ, లక్షల్లో ఫీజులు దండుకోవడానికి సిద్ధమయ్యారన్నారు. దానికి తగ్గట్టుగా జిల్లాలో ఫ్లెక్సీలతో ప్రచారం సైతం నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న గురునానక్ యూనివర్సిటీ కార్యాలయం యజమాన్యం పై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఆ కార్యాలయాన్ని సీజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్, ఐక్య విద్యార్థి సంఘాల నాయకుడు షేక్ సల్మాన్ పాషా, జుమ్మడి గోపాల్ లు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన ధాన్యం సేకరణ

* **జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్**




మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 07 సమయం న్యూస్: జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 219 కేంద్రాలు ద్వారా 6 వేల 322 మంది రైతుల వద్ద నుండి 50 వేల 707 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 32 కోట్ల 13 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 355 లారీల ద్వారా 3 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్ లోని 58 మిల్లులకు, జిల్లాలోని 16 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 3 కోట్ల రూపాయల నుండి 5 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్ లను వినియోగించుకోవాలని తెలిపారు. ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్ ఎ, సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఓఆర్ఎస్, గోనె సంచులు, టార్పాలిన్ లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మందమర్రి, మే 07 సమయం న్యూస్: అకాల వర్షానికి రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యం తడవడం జరిగిందని, తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బిజెపి నాయకులు దేవరనేని సంజీవరావు, వంజరి వెంకటేశ్ లు డిమాండ్ చేశారు. బుధవారం వారు మండలంలోని పొన్నారం, వెంకటాపూర్, లేమూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకెపి, పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లు బస్తాలలో నింపి, కాంటా వేసి ఉంచిన సంచులు, అకాల వర్షానికి పూర్తిగా తడవడం జరిగిందని, ఈ వడ్లను మరల ఆరబెట్టకుండా, మైచర్ చేయకుండా, గన్ని సంచులను



వెంటనే రవాణా చేయాలని కోరారు. ఈ విషయపై సంబంధిత అధికారులు సంప్రదించగా, వారు తమకు సంబంధం లేదని, తమకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, మరల మైచర్ చేయాలని తెలిపారన్నారు. వెంటనే రైతులకు ఇబ్బంది కలగకుండా తడి వడ్ల సంచులను వెంటనే రైస్ మిల్లులకు రవాణా చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుండా రైతులను ఇబ్బంది పెడితే ఆందోళనలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి, రైతులకు భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం మండల అధ్యక్షుడు పెంచాల రంజిత్, నాయకులు ధరవేణి రవి, కర్రీ రాజయ్య, దుర్గం మల్లేష్, గంజి రాజేష్, మనుబోతుల రమేష్, సిద్ధన లచ్చన్న, సూరిమిల్ల రామకృష్ణ, సైలేంద్ర శ్రీనివాస్, జుబ్బిడి దిలీప్, సుద్దాల సత్తయ్య లు పాల్గొన్నారు.



## ఇక్రా హై స్కూల్ విద్యార్థినీ సన్మానించిన సబ్ కలెక్టర్

బోధన్ పట్టణం, మే 7, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఇక్రా హై స్కూల్ కు చెందిన రఫియా తరన్నుమ్, పదవ తరగతి బోర్డు పరీక్షల్లో 600కి 575 మార్కులు సాధించి ఉర్దూ మీడియం మైనారిటీ విద్యార్థుల్లో టాపర్ గా నిలిచింది. ఈ అద్భుతమైన విజయం పట్ల పాఠశాల కరస్పాండెంట్ ఉమైర సంతోషం వ్యక్తం చేస్తూ, ఇంత మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చినందుకు ఆమెను అభినందించారు. ఈ విజయానికి కారణంగా ఉన్న ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర బృందానికి కృతజ్ఞతలు, తల్లిదండ్రులు మాపై ఉంచిన నమ్మకమే ఈ విజయానికి కారణం అని అన్నారు. రాష్ట్రస్థాయి లో మంచి మార్కులు సాధించడం పట్ల ఆనందం వ్యక్త చేస్తూ నేడు సబ్ కలెక్టర్ వికాస్ మహతోనీ వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వారిచే విద్యార్థిని అభినందింప చేశారు. ఈ కార్యక్రమంలో తండ్రీ ఎమ్ఐ రజాక్, ఉపాధ్యాయులు రబ్బాని పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికుల రక్షణలో అధికారుల నిర్లక్ష్యం

మందమర్రి, మే 07 సమయం న్యూస్: సింగరేణి ఏరియాలోని సివిక్ కాంట్రాక్ట్ కార్మికులు కనీస రక్షణ పరికరాలు లేకుండా పని చేస్తున్న సింగరేణి అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తూ, వారిపై సవితి తల్లి ప్రేమను చూపిస్తూ, కాంట్రాక్టు కార్మికుల రక్షణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో ఆరోపించారు. కార్మిక కాలనీలను శుభ్రపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్న సివిక్ కాంటాక్ట్ కార్మికులకు కనీస రక్షణ పరికరాలైన గ్లౌజులు, మాస్కులు ఇవ్వకుండా పనిచేయించడం చాలా దుర్మార్గమని తెలిపారు. దీంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబ సభ్యులను సింగరేణి ఆసుపత్రికి సైతం తీసుకెళ్తే కనీసం వైద్యం చేయలేని దుస్థితి సింగరేణిలో నెలకొందని ఎద్దేవా చేశారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోకుండా వ్యవహరించడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సివిక్ కాంట్రాక్ట్ కార్మికులపై వివక్షణ వీడి టెండర్ లో ఉన్న విధంగా కార్మికులకు రావాల్సిన రక్షణ పరికరాలు అందించే విషయంలో శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హెచ్డీఎఫ్సి బ్యాంక్ భీమా అమలు అయ్యేందుకు ఇప్పటికి చాలామంది కార్మికులకు శాలరీ



అకౌంట్లుగా మార్చలేదని, ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి ఎంతో కొంత ఆసరా ఉండే ఇలాంటి పథకాల అమలుపై అధికారులు శ్రద్ధ పెట్టి, అమలు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సివిల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి, కాంట్రాక్ట్ కార్మికులందరికీ హెచ్డిఎఫ్సి శాలరీ ఖాతాలు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరసన, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం



## వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు క్రీడా కిట్లు పంపిణీ

* **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 07 సమయం న్యూస్: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు క్రీడ కిట్లు పంపిణీ చేయడం జరిగిందని, క్రీడాకారులు ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా క్రీడా యువజన సేవల శాఖాధికారి కీర్తి రాజ్ వీరు తో కలిసి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారు అందించిన క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవి సందర్భంగా ప్రత్యేక క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా సెంటర్ బాక్సింగ్ కోచ్ చిలువేరు రాజేష్, పుట్ బాల్, వాలీబాల్, కరాటే శిక్షకులు వనిత, పున్నం చందు, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించండి

* **కలెక్టర్ ను కోరిన**
* **ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి**

గజ్వేల్, మే 7 : గజ్వేల్ పరిధిలోని మల్లన్న సాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరిని కోరారు. గత వారం రోజులుగా ఆర్ అండ్ ఆర్ కాలనీ గ్రామాలలో పారిశుద్ధ కార్మికులు చెత్త సేకరణ నిలిపివేయడంతో ఆయా గ్రామాల నాయకులు సమస్యను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు వెంటనే కలెక్టర్ మను చౌదరిని ఫోన్ ద్వారా సంప్రదించి పునరావాస ప్రజల సమస్యలను



వెల్లడించారు. గ్రామపంచాయతీలను కొనసాగిస్తున్నారా? లేదా మున్సిపాలిటీలో విలీనం చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే నోటిఫై చేశామని మున్సిపాలిటీలో విలీనం కోసం ప్రభుత్వానికి ఫైల్ పంపినట్లు ఎమ్మెల్సీకి వివరించారు. చెత్త సేకరణ ఇతర నిర్వహణ విషయమై మున్సిపల్ కమిషనర్లకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు కలెక్టర్ చెప్పారు. త్వరలోనే గజ్వేల్ లో లోకల్ బాడీ జాయింట్ కలెక్టర్ తో ప్రత్యేక మీటింగ్ ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను ఎమ్మెల్సీ యాదవ రెడ్డి కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. నిర్వాసితుల కాలనీలో కనీసం సౌకర్యాలు లేవని స్మశాన వాటిక లేక ఒకే చోట అంత్యక్రియలు జరుపుతున్నారని ఆయన కలెక్టర్ కు వెల్లడించారు. ప్రతి గ్రామంలో స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు. అనంతరం మల్లన్న సాగర్ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసినట్లయితే వెంటనే జీవో ప్రభుత్వం జారీ చేయాలని ఎమ్మెల్సీ కోరారు. జిల్లా కలెక్టర్ ద్వారా స్థానిక మున్సిపాలిటీకి ఆదేశాలు ఇవ్వాలన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసితుల కాలనీలో నెలకొన్న సమస్యలతో పాటు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో విలీనం విషయాన్ని సంబంధిత శాఖ ఉన్నంత అధికార దృష్టికి తీసుకుపోతామని వెంటనే పరిష్కారం చేసే విధంగా కృషి ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవ్ రెడ్డి పునరావాస గ్రామాల నాయకులకు వెల్లడించారు..



## హుంన్సా గ్రామంలో గౌతమ బుద్ధ విగ్రహ ప్రతిష్టాపనకు ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి ఆహ్వానించిన గ్రామ పెద్దలు

సాలూర మండలం, మే 7, సమయం న్యూస్ : వైశాఖ శుద్ధ పౌర్ణమి మే 12వ తేదీన నిజామాబాద్ జిల్లా సాలురా మండలం హుంసా గ్రామంలో గౌతమ బుద్ధ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, నియోజకవర్గ శాసనసభ్యులు పి. సుదర్శన్ రెడ్డిని గ్రామ పెద్దలు ఆహ్వానించారు. వారు సానుకూలంగా స్పందించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. శాంతి, ఐక్యతకు ప్రతీకగా బుద్ధుని విగ్రహాన్ని గ్రామంలో ప్రతిష్ఠించాలన్న సంకల్పానికి నేతలు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు గ్రామ నాయకులు పిసిసి డెలికేట్ గంగా శంకర్, కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు నరేందర్ రెడ్డి, నాగేశ్వరరావు, బోధన్ మార్కెట్ కమిటీ ఇన్చార్జ్ చైర్మన్ చీల శంకర్, గ్రామ అధ్యక్షులు శంకర్, మాజీ ఉపసర్పంచ్ హనుమంతు, రమేష్, గౌతమ్, పీరాజి వీరప్ప, మహారాజ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ విగ్రహ ప్రతిష్టాపనతో గ్రామ అభివృద్ధి, మానసిక శాంతి, యువతలో స్ఫూర్తి ఏర్పడుతుందని పెద్దలు అభిప్రాయపడ్డారు.

# సాలురా లో కల్తీ కల్లులపై అవగాహన సదస్సు

* తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో

సాలూర మండలం, మే 7 సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలోని సాలూరు మండల కేంద్రంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సోమనాథం ఆధ్వర్యంలో కల్తీ కల్లు అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగంగా ఈ బ్యూరోను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సోమనాథం మాట్లాడుతూ నిజామాబాద్కామారెడ్డి జిల్లాల్లో కల్తీ కల్లు వలన ప్రజలు తీవ్ర ఆరోగ్య



సమస్యలు ఎదుర్కొంటున్నారని, కొంతమంది వ్యాపారులు కల్లులో నార్కోటిక్ పదార్థాలు మిక్స్ చేసి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. ఆల్ఫోజోమ్, డైజాపామ్ వంటి మత్తు మందులు కలిపి ప్రజలకు విక్రయించడం ద్వారా శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు కల్తీ కల్లుపై సమాచారం కోసం 1908 లేదా 100 నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడుతుందని తెలియజేశారు. ఇప్పటివరకు రూ. 200 కోట్లు విలువైన ఆస్తులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఇట్టి కార్యక్రమంలో బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి ఎక్సైజ్ ఎస్సై జలాలుద్దీన్ సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, ప్రముఖ నాయకులు అల్లే రమేష్, కేజీ గంగారం, డిస్కో సాయిలు, ఇల్తేపు రమేష్ గ్రామ ప్రముఖులు, గ్రామస్థాయి అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# డంప్ యార్డ్ కు నిరసనగా 92 వరోజు చేరిన రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల,మే 7,సమయం న్యూస్: గుమ్మడిదల మున్సిపాలిటీ లోని నల్లవల్లి,ప్యారానగర్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న డంప్ యార్డ్ కు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 92వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల జేఏసీ నాయకులు, గ్రామ మహిళలు సంఘీభావంతెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రైతుల కుటుంబాలకు నష్టం వాటిల్లకుండా చూడాలని వారు కోరారు. ప్రజా భిప్రాయం మేరకు డంప్ యార్డును పూర్తిగా రద్దుచేసి, ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రతిపాదిత డంప్ యార్డ్ ను పూర్తిగా రద్దు చేసే వరకు మా పోరాటాలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.





## వాలీబాల్ వేసి శిక్షణ శిబిరం ప్రారంభం

రాయపోల్.మే 07 : సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో గత నాలుగు రోజుల నుండి జరుగుతున్న వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించి, వాలీబాల్స్ అందించిన క్రీడాజ్యోతి ఫౌండేషన్ సభ్యులు A.నవీన్,M. నరేష్. ఈ సందర్భంగా క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ,ఈ వేసవి వాలీబాల్ శిక్షణ వలన క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఎంతో దోహదపడుతుందని, ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని మండల,జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా ఎదగడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు తెలియజేయశారు. అదేవిధంగా ఉన్నత స్థాయి క్రీడాకారులుగా ఎదగడానికి మా క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వాలీబాల్ శిక్షణ శిబిరం నిర్వాహకుడు A.కనకయ్య, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు స్వామి, నరేష్, ప్రవీణ్ ,మధు, భరత్ ,నరేష్ పాల్గొన్నారు.



## పటేల్ నగర్ చౌరస్తాలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునికరించాలి

**: కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్**

అంబర్ పేట మే 7(సమయం న్యూస్): అంబర్ పేట పటేల్ నగర్ చౌరస్తాలో చిన్నపాటి వర్షానికి కూడా నాలా నుండి నీరు రోడ్లపైకి వస్తుండడంతో వాహనల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పాదచారులకు నిత్యం అసౌకర్యం కలుగుతుందని కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్ అన్నారు.సంబంధిత అధికారులు DE ప్రశాంతి, AE శ్రీగంద్ నీ పిలిపించి పరిస్థితిని వివరించారు. మరియు సిపిఎల్ అసిస్టెంట్ కమాండెంట్ త్రిలోక్ నాథ్ రెడ్డి ,సిపిఎల్ ఇంచార్జ్ వీరు లకు పరిస్థితిని వివరించి నూతన రిటైనింగ్ వాల్ నిర్మించడానికి సహకరించాలని తెలియజేశారు. అధికారులు మాట్లాడుతూ సమస్యని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యని వివరిస్తామని,సమస్య పరిష్కారం కొరకు మా వంతు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి ఈ ప్రశాంతి,ఏఈ శ్రీ గంద్, అసిస్టెంట్ కమాండర్ శ్రీ త్రిలోక్ నాథ్ రెడ్డి,సిపిఎల్ ఇంచార్జ్ వీరు,సివిల్ వర్క్ ఇన్స్పెక్టర్ దుర్గ,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రఫీక్,సందని,సంతోష్ చారి,తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలు

అంబర్ పేట,మే,7(సమయం న్యూస్): రామంతాపూర్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి సందర్భంగా 108 లీటర్ల ఆవుపాలతో పంచామృతంతో అమ్మవారికి అభిషేకం జరిగింది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ తదుపరి సామూహిక కుంకుమార్చన, నామస్మరణ, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదము, అన్నప్రసాద కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామంతపూర్ 9వ డివిజన్ అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్త, కల్మకల లింగం, దేవాలయ కమిటీ మెంబర్స్,మేడ్చల్ జిల్లా ఐ.వి.ఎఫ్ అధ్యక్షులు సంబు పాండయ్య గుప్త, రామంతపూర్ కన్యకా పరమేశ్వరి టెంపుల్ అధ్యక్షుడు భువనగిరి శ్రీనివాస్ గుప్తా, కొత్తపెల్లి రమేష్ గుప్తా, గట్టు ప్రకాష్ గుప్తా, ఊరే నాగేష్ గుప్తా,విశ్వనాధుల మంజునాథ్ గుప్తా, పోలా వెంకటేష్ గుప్తా, జిల్లా హరిబాబు గుప్తా, తిరుపతి గుప్తా, భువనగిరి రవి గుప్త, పల్లెర్ల బిక్షపతి గుప్తా, ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ మహిళా మెంబర్స్ కూడా పాల్గొనడం జరిగింది.

# పదవ తరగతి ఉత్తమ విద్యార్థులను సబ్ కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం

బోధన్ పట్టణం, మే 7, సమయం న్యూస్: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, సామాజిక కార్యకర్త సనా పటేల్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో బుధవారం వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సబ్ కలెక్టర్ చే సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, తట్టి కోట్ కు చెందిన విద్యార్థిని స్రవంతి, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లో గల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి విగ్నేష్, బస్వతారక నగర్ ఉన్నత పాఠశాల, దార్లూం ఉర్దూ మీడియం స్కూల్, నిజామీయ ఇంగ్లీష్ & ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులు ఈ గౌరవానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పాఠశాలల్లో చదువుతోపాటు ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలు మరింత అవసరమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో అతిక్ అహ్మద్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు

బోధన్ పట్టణం, మే 7, సమయం న్యూస్ : వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా బోధన్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ సమీపంలో గల శ్రీ నగరేశ్వర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జన్మోత్సవాన్ని బుధవారం రోజు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జయంతి సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి అమ్మవారికి విశేష పూజలు, అష్టాదశ దశ పండ్ల రసాలతో అభిషేకం, పంచామృత అభిషేకం, నూతన వస్త్రాలతో అలంకరణ, పుష్పార్చనలు నిర్వహించబడింది. ఈ



కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని కుంకుమార్చన, పూల అర్చన చేయడంతో పాటు భజనలు, కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి శ్రీనివాస్, సిఐ వెంకట నారాయణ పాల్గొన్నారు. వేడుకలకు హాజరైన భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, శక్కర్‌నగర్, కొత్త బస్టాండ్, ఎల్‌బీఎస్‌నగర్, రాకాసిపేట్, పోస్ట్ ఆఫీస్ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు కొత్త రాజేశ్వర్, గంజి వెంకటేశం, పబ్బ మురళి, కంటాల రమేష్, కన్నె సంతోష్, వాసర గంగాధర్, గంగం కిరణ్, పార్శి శ్రీధర్ తదితరులు కీలక పాత్ర పోషించారు.

# మహారాజ్ బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమం పీఠాధిపతి
# శ్రీ దత్తాత్రేయ స్వామి శ్రీ షిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రిక

శివంపేట్ 7 సమయం న్యూస్ : శ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్ బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమం పీఠాధిపతి వారిని దర్శించి శ్రీ గురుపీఠం ఆధ్వర్యంలో జూన్ 5వ జరిగే శ్రీ దత్తాత్రేయ స్వామి శ్రీ షిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్టకు రావలసిందిగా ఆహ్వాన పత్రికను ఇచ్చి ఆహ్వానించడం అయినది శ్రీ దత్తగిరి ఆశ్రమంలో శిక్షణ పొందిన పొందుతున్న 70 మంది వేద విద్యార్థులతో కలిసి వస్తామని విజయవంతంగా జరుపుదామని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్ద గోలి శివకుమార్ గౌడ్ తో పాటు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రాజ్యం బిక్షపతి, కార్యవర్గ సభ్యులు లికిత, రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.



# వృద్ధులు, దివ్యాంగులకు
# ప్రతి నెల మొదటి బుధ వారం ప్రత్యేక ప్రజావాణి

* **అర్జీలు స్వీకరించిన కలెక్టర్**

మహబూబ్ నగర్ మే07(సమయం న్యూస్) : వృద్ధులు, దివ్యాంగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో మొదటిసారిగా వృద్ధులు, దివ్యాంగుల కోసం నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో




వయోవృద్ధులు,దివ్యాంగుల కోసం ప్రతినెలా మొదటి బుధవారం నిర్వహించే ప్రత్యేక ప్రజావాణి లో తమ తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుక రావచ్చని అన్నారు. తమ తమ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆమె అక్కడి అధికారులను ఆదేశించారు.ఈ ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో 38 మంది అర్జీలను ఆమె స్వీకరించి అక్కడే ఉన్న సంబంధిత అధికారులను సమస్యల పరిష్కారానికి సమాలోచనలు చేశారు. సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న కొన్ని సమస్యలను కలెక్టర్ దృష్టికి తేగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు డిఆర్డీవో జోజప్ప,నగరపాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి జరీనా బేగం, అర్బన్ తహశీల్దార్ ఘన్సీరాం, ఎల్డీయం భాస్కర్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబీషన్ అధికారి నర్సింహారెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు నాగభూషణం, బాలయ్య, మనోహర్ రావు, రాజసింహుడు, తదితరులు పాల్గొన్నారు.

# మిల్లుల వద్ద ధాన్యం దిగుమతిలో
# జాప్యానికి తావులేకుండా చర్యలు

* **ధాన్యం నిల్వల కోసం అదనపు గోడౌన్లు గుర్తించాలి**
* **కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్**
* **రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశం**

నిజామాబాద్, మే 07( సమయం న్యూస్) రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకోవడంలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్నివెంటదివెంట నిర్దేశిత మిల్లులకు తరలించడంతో పాటు, తక్షణమే మిల్లుల వద్ద అన్ లోడింగ్ జరిగేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఆర్మూర్ మండలం పెర్కిట్ శివారులో మెప్మా ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు, బాల్కొండ మండల కేంద్రంలో, మోపాల్ మండలం వెంచిర్యాలలో పీఏసీఎస్, ఐకేపీ మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతులను పలుకరించి, ధాన్యం అమ్మకం విషయంలో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. కేంద్రాలకు ఎప్పుడు ధాన్యం తీసుకువచ్చారు, ఎన్ని రోజులకు తూకం జరిగింది, కేంద్రాల నిర్వాహకులు సహకరిస్తున్నారా, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల



గురించి, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాల రికార్డులను పరిశీలించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలతో కూడిన వాహనాలు ఎక్కువ సమయం పాటు నిలిచి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకుని నిలువ చేసుకునేందుకు వీలుగా అందుబాటులో ఉన్న గోడౌన్లను గుర్తించాలని, హమాలీలు, లారీల కొరత నెలకొనకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా సరిపడా సంఖ్యలో టార్పాలిన్లు సమకూర్చుకోవాలని అన్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే 7 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని సేకరించడం జరిగిందన్నారు. ఇంకనూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలిస్తున్నందున కొనుగోలు ప్రక్రియలో ఎక్కడ కూడా జాప్యం జరుగకుండా చూడాలన్నారు. రైతులు ఇబ్బందులకు గురికాకూడదని, నిర్ణీత గడువు లోపు ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేలా అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని హితవు పలికారు.

# పాఠశాల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

: **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

* **టి.జి.ఈ. డబ్ల్యూ.ఐ.డి.సి పనుల పై సమీక్షించిన జిల్లా కలెక్టర్**



పెద్దపల్లి, మే 07(సమయం న్యూస్) : విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ పాఠశాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో టి.జి.ఈ. డబ్ల్యూ.ఐ.డి.సి అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించారు. టి.జి.ఈ. డబ్ల్యూ.ఐ.డి.సి ద్వారా పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులు, యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనుల పురోగతి వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో మాడల్ స్కూల్స్, గురుకులాలు, జడ్పి ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలో టి.జి.ఈ. డబ్ల్యూ.ఐ.డి.సి ద్వారా చేపట్టిన అదనపు తరగతులు, సైన్స్ ల్యాబ్ నిర్మాణం, కాంపౌండ్ వాల్ వివిధ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనులు ప్రారంభించాలని , నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలని అన్నారు. రామగుండం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిన్నోవేషన్ పనులు పూర్తి చేయాలని అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం క్రింద గోదావరిఖని పీజీ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు టెండర్ ఒప్పందం పూర్తి చేసుకుని మే 20 నాటికి పనులు ప్రారంభించాలని అన్నారు. జిల్లాలో చేపట్టిన చిల్డ్రన్ హోమ్ నిర్మాణంలో పురోగతి సరిగ్గా లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తయ్యేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. కోటి పది లక్షల రూపాయలతో చేపట్టే ఐటిఐ ఇన్నోవేషన్ పనుల టెండర్లు పూర్తి చేసి 5 నెలల వ్యవధిలో పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఈఈ టి.జి.ఈ. డబ్ల్యూ.ఐ.డి.సి అనితా శింగనాథ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రమశక్తి అవార్డు గ్రహీత నరేందర్ కు ఘన సన్మానం

మందమర్రి, మే 07 సమయం న్యూస్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా హైదరాబాద్ లోని రవీంద్రభారతి లో జరిగిన మేడే వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక శ్రమశక్తి అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులు మీదుగా స్వీకరించిన ఏరియాలోని కేకే 5 గనిలో అసిస్టెంట్ చైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న రాంశెట్టి నరేందర్ ను బుధవారం ఏరియా సర్వే అధికారి బి దేశాయ్ సర్వే డిజిఎం శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏరియాకు శ్రమశక్తి అవార్డు రావడం అత్యంత గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఓ జి వెంకటేశ్వరరావు, సర్వేయర్ వి నరేష్, ఏ సురేష్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## సీతంపేట మండలంలో వివిధ ప్రాంతాల్లో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన





సీతం పేట, మే 7, సమయం న్యూస్ : సీతంపేట మండలంలో వివిధ ప్రాంతాల్లో పలు ప్రారంభోత్సవా లలు మరియు శంకుస్థాపన కార్యక్రమలలో పాల్గొన్న పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ. సీతంపేట మండలంలోని 24 స్కూల్లకు 2.52 కోట్ల రూపాయలతో నిర్మించిన ప్రహరీ గోడ పనులు పూర్తి అయ్యాయి. మల్లి మరియు జిల్లేడుపాడు గ్రామాలలో ఈ రోజు వాటిని ప్రారంబించారు. సీతంపేట మండలం మల్లి గ్రామంలో 48.00 లక్షల ఊది హామీ నిధులతో నిర్మించిన A.P.T.W.R. పాఠశాల ప్రహరీ గోడ, జిల్లేడుపాడు గ్రామంలో 10.00 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన M.P.U.P. పాఠశాల ప్రహరీ గోడ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ. అలాగే సీతంపేట మండలం జిల్లేడుపాడు గ్రామంలో MGNREGS 33,041/ రూపాయిల నిధులతో నిర్మించిన పశువుల కోసం నీటి తొట్టె ప్రారంభ కార్యక్రమం, శంభం గ్రామంలో MGNREGS 5.50 లక్షల నిధులతో PMJJM ఆధ్వర్యంలో RWS వాటర్ సప్లై పైప్ లైన్, వాభ గ్రామంలో MGNREGS 8.80 లక్షల నిధులతో PMJJM ఆధ్వర్యంలో RWS వాటర్ సప్లై పైప్ లైన్ యొక్క శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ. ఈ కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ ఐటిడిపి కో ఆర్డినేటర్ ఇమరక పవన్, AMC చైర్మన్ బిడ్డిక సంధ్యారాణి, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర తూర్పు కాపు డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, ఇమరక ప్రసాద్, మల్లయ్య, జనసేన రాజేష్, బీజేపీ రవణమ్మ, సింహాచలం, రఘు, శ్రీకాంత్, కిషోర్, జనసేన ప్రసాద్, పాలకొండ మండల జనసేన నాయకులు ప్రసాద్, సంతోష్, శేఖర్, సాయి, శివ, ప్రశాంత్ మరియు వివిధ హోదాలో ఉన్న NDA కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గున్నారు.



## పెగడపల్లి గ్రామంలో ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం

బోధన్ మండలం, పెగడపల్లి గ్రామం, మే 7, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి ఘనంగా నిర్వహించబడింది. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలకులతో పోరాడి తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అల్లూరి సీతారామరాజుకు గ్రామ ప్రజలు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా గ్రామంలో ఘనమైన సభ నిర్వహించబడింది. అల్లూరి గారి త్యాగాలు, దేశభక్తి భావం నేటి యువతకు మార్గదర్శకంగా నిలవాలని నేతలు పేర్కొన్నారు. బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేపట్టి, యువతలో జాతీయత గలవాడిగా నిలిచిన అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి. కృష్ణారెడ్డి, మేడి రవి, నర్సారెడ్డి, బాదూరి లింగారెడ్డి, డీజిల్ రవి, గణేష్ గౌడ్, హెచ్. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.





## గౌలిపుర స్లాటర్ హౌస్ త్వరలో పున:ప్రారంభిస్తాం

: **జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్**

హైదరాబాద్, మే 07: సంతోష్ నగర్ సర్కిల్ గౌలిపుర మేకల మండి (స్లాటర్ హౌస్) త్వరలో పున:ప్రారంభించడం జరుగుతుందని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ అన్నారు. బుధవారం ఉదయం గౌలిపుర స్లాటర్ హౌస్ భవనం ఆయన పరిశీలించారు. గౌలిపుర మేకల మండి గతంలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో బాగా నడిచిందని, కాలనీకి చెందిన ఒక వ్యక్తి కోర్టుకు వెళ్లడం తో నిలిచిపోయిందని అప్పటి నుండి స్లాటర్ హౌస్ పనిచేయకపోవడంతో ఆధారపడిన కుటుంబాలు ఇబ్బందులు పడ్డారని, కోర్టు తీర్పు ఇచ్చి చాలా రోజులు అవుతున్నందున యంత్రాలు, మరమ్మత్తులు ఇంకా కొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కమ్యూనిటీ పెద్దలు ఈ సందర్భంగా కమిషనర్ ను కోరారు. బిల్డింగ్, యంత్రాల మరమ్మత్తులు, నీరు ఇతర వసతులు ఏర్పాటు చేసి త్వరలోనే పునః ప్రారంభించడం జరుగుతుందని కమ్యూనిటీ పెద్దలకు కమిషనర్ వివరించారు. ప్రాజెక్ట్ ఇంజనీర్ కు ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ వెంట హెల్త్ అడిషనల్ కమీషనర్ పంకజ, జోనల్ కమీషనర్ వెంకన్న, జోనల్ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, ప్రాజెక్టు ఎస్ ఈ శ్రీలక్ష్మి, సంతోష్ నగర్ డిప్యూటీ కమీషనర్ మంగతాయారు, గౌలిపుర కార్పొరేటర్ భాగ్య లక్ష్మీ, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.



## పెగడపల్లి గ్రామంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం

* **యాంటీ నార్కోటిక్స్, ఎక్సైజ్ శాఖలు**

బోధన్ మండలం, పెగడపల్లి గ్రామం, మే 7, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పెగడపల్లి గ్రామంలో బుధవారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో మరియు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. డ్రగ్స్, గంజాయి, ఆల్కహాల్, కల్తీ కల్లు, ఆల్ఫాజోమ్, డైజోఫామ్ వంటి మత్తు పదార్థాలు యువతను తీవ్రంగా వ్యసనాలకు గురిచేస్తున్నాయని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్స్ ఏసీపీ సోమనాథ్, ఎక్సైజ్ సీఐ, బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ యువతతో పాటు చిన్నపిల్లలు కూడా గంజాయి, మద్యం వలెదు పదార్థాలకు బానిసలవుతున్నారని, ఇది భవిష్యత్తుకు ముప్పుగా మారుతుందని అన్నారు. ప్రజలు కల్తీకల్లు పై సమాచారం కోసం 1908 లేదా 100 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, పోత్తరెడ్డి, మేడి రవి, సుదర్శన్, నారాయణరెడ్డి, నాగభూషణ్, ఎండి షబ్బీర్, సాయిలు, పోశెట్టి, సతీష్ గౌడ్, సైదా గౌడ్, గణేష్ గౌడ్, నాగరాజ్ గౌడ్, సాగర్, గంగాధర్, బీరయ్య, పంచాయతీ సెక్రటరీ, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



నిర్మల్ మే, 07( సమయం న్యూస్) : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు వసతులు తప్పని సరిగా ఉండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కుంటాల మండలం అందకూర్ గ్రామంలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో టెంట్, త్రాగునీరు తదితర వసతులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్... కొనుగోలు ప్రక్రియలో అలసత్వం కారణంగా రెండు లక్షల రూపాయల జరిమానా విధించారు. సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని తక్షణమే తూకం వేసి తరలించాలన్నారు. తేమ శాతం నిబంధనల మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. తగినన్ని గన్ని సంచులు, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అన్ని రిజిస్టర్లను పరిశీలించిన అనంతరం ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తెలుపాలని కలెక్టర్ రైతులను కోరారు. ప్యాడీ క్లీనింగ్ యంత్రాల ద్వారా ధాన్యాన్ని శుభ్రపరచాలని సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# టెస్టుల్లో ఇక రో'హిట్'ను చూడలేం..

## ఆ కల నెరవేరకుండానే రిటైర్మెంట్

ఐపీఎల్ మ్యాచ్‌లతో ఎంజాయ్ చేస్తున్న అభిమానులకు టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ షాకింగ్ న్యూస్ చెప్పాడు. టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్లు వెల్లడించాడు. వచ్చే నెలలో ఐదు టెస్టుల సిరీస్ కోసం టీమ్ఇండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనున్న వేళ హిట్‌మ్యాన్ ఈ కీలక ప్రకటన చేశాడు. రోహిత్ టెస్టు కెరీర్ తక్కువ కాలమే కొనసాగినప్పటికీ అతనికి ఈ ఫార్మాట్‌లో ఎన్నో మధుర జ్ఞాపకాలున్నాయి. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఏడేళ్ల తర్వాత రోహిత్ సుదీర్ఘ ఫార్మాట్‌లోకి అరంగేట్రం చేశాడు. గాయాల బారినపడటం వల్ల టెస్టుల్లోకి ఆలస్యంగా ఎంట్రీ ఇచ్చాడు. 2013లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌తో టెస్టుల్లోకి అడుగుపెట్టిన హిట్‌మ్యాన్.. తొలి మ్యాచ్‌లోనే అదరగొట్టాడు. టాపార్డర్ విఫలమైన వేళ ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి 177 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. కెరీర్ ఆరంభంలో మిడిల్ ఆర్డర్‌లో ఆడిన రోహిత్.. 2019లో ఓపెనర్‌గా ప్రమోట్ అయ్యాడు. మంచి శుభారంభాలు అందిస్తూ జట్టులో తన స్థానం సుస్థిరం చేసుకున్నాడు. 2022లో విరాట్ కోహ్లీ టెస్టు కెప్టెన్సీ నుంచి వైదొలగడంతో జట్టు పగ్గాలను రోహిత్ అందుకున్నాడు. 202123 డబ్ల్యూటీసీలో టీమ్ఇండియాను ఫైనల్ వరకు తీసుకెళ్లినా ఛాంపియన్‌గా మాత్రం నిలపలేకపోయాడు.




రోహిత్ సారథ్యంలో టీమ్ఇండియా 24 టెస్టులు ఆడగా.. 12 మ్యాచ్‌లు విజయం సాధించి తొమ్మిది మ్యాచ్‌ల్లో ఓడింది. మూడు డ్రా అయ్యాయి. అలవోకగా సిక్సర్లు బాదే ఈ ముంబయి ఆటగాడికి టెస్టుల్లో మంచి రికార్డు ఉంది. వీరేంద్ర సెహ్వాగ్ (90 సిక్సులు, 103 మ్యాచ్‌లు) తర్వాత టెస్టుల్లో ఎక్కువ సిక్సర్లు బాదిన భారత ఆటగాడు రోహితే. 68 మ్యాచ్‌ల్లోనే 88 సిక్సర్లు బాదాడు. ఇక, టెస్టుల్లో రో'హిట్'ను చూడలేమని అభిమానులు నిరాశకు లోనవుతున్నారు. ఇక, హిట్‌మ్యాన్ మెరుపులను మనం వన్డేల్లోనే చూస్తాం. వరుసగా రెండు ఐసీసీ ట్రోఫీలు (టీ20 వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ) సాధించిన రోహిత్..డబ్ల్యూటీసీ టైటిల్ సాధించాలనే కలను మాత్రం నెరవేర్చుకోలేకపోయాడు.




## కీలక మ్యాచ్‌లో కోల్‌కతా ఓటమి.. చెన్నైకి మూడో విజయం

కోల్‌కతా: ఐపీఎల్ 18లో కీలక మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఓటమి పాలైంది. ఈడెన్ గార్డెన్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ ఓటమితో కోల్‌కతా ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం అయ్యాయి. తొలుత కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. అజింక్యా రహానె (48) రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 19.4 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. డెవాల్డ్ బ్రెవిస్ (52) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. శివమ్ దూబె (45) రాణించాడు. తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన ఉర్విల్ పటేల్ (31: 11 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సులు) ఆకట్టుకున్నాడు. కోల్‌కతా బౌలర్లలో వైభవ్ అరోరా 3, వరుణ్ చక్రవర్తి 2, హర్షిత్ రాణా 2, మొయిన్ అలీ ఒక వికెట్ తీశారు.



# మేమంతా మీ వెంటే

ఆపరేషన్ సిందూర్ పేరిట ఇండియన్ ఆర్మీ పాకిస్తాన్‌లోని ఉగ్ర శిబిరాలపై మెరుపు దాడులు చేసింది. భారత సైన్యం చేపట్టిన చర్యల పట్ల సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సినీ, వ్యాపార, క్రీడా ప్రముఖులు, నెటిజన్స్ 'భారత ఆర్మీకి సెల్యూట్..మేమంతా మీ వెంటే ఉంటాం' అంటూ పోస్ట్ లు పెడుతున్నారు. 'జై హింద్', 'భారత్ మాతాకీ జై', 'ఆపరేషన్ సిందూర్' అంటూ హ్యాష్ ట్యాగ్‌లతో సోషల్ మీడియాలో పోస్ట్ లు వెల్లువెత్తుతున్నాయి. 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైనందుకు ఆనందంగా ఉందంటూ అగ్ర కథానాయకుడు చిరంజీవి 'జైహింద్' అని రాశారు.

**పవన్ కల్యాణ్:** ఎన్నో రోజుల నిశ్శబ్దం తర్వాత 'ఆపరేషన్ సిందూర్' భారతదేశం మొత్తంలో స్ఫూర్తిని నింపింది. త్రివిధ దళాల ధైర్యం, అలాగే ఈ ఆపరేషన్‌కు నాయకత్వం వహించి సైన్యానికి అండగా ఉన్న ప్రధానమంత్రికి ధన్యవాదాలు. మేమంతా మీతోనే ఉన్నాం.

**రజనీకాంత్:** పోరాటం ఇప్పుడే ప్రారంభమైంది. లక్ష్యం పూర్తయ్యేవరకూ ఆగదు. దేశం మొత్తం మీతో ఉంది. జైహింద్ .

**ప్రకాశ్ రాజ్:** ఉగ్రవాదాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో మాత్రమే భారత్ చర్యలు చేపట్టింది. పాకిస్థాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదు. మన దేశం లక్ష్యాలను నిర్దేశించుకోవడంలో సంయమనం పాటించింది. 26 మందిని దారుణంగా చంపినందుకు మాత్రమే ఈ చర్యలు జరిపింది. మేం నిబద్ధతకు కట్టుబడి ఉంటాం.

**ఖుష్బూ:** భారత్ మాతా కీ జై.. న్యాయం జరిగింది

**జూనియర్ ఎన్టీఆర్ :** మన భారత సైన్యం భద్రత, బలం కోసం ప్రార్థిస్తున్నాను.. జై హింద్

**కల్యాణ్ రామ్ :** మన రక్షణ దళాలకు మరింత బలం, శక్తి ఇద్దాం. ఆపరేషన్ సిందూర్ పహల్గామ్ టెర్రర్ దాడులకు బలమైన సమాధానం. గౌరవించండి. సంకల్పించండి. జ్ఞాపకం చేసుకోండి.

**అల్లు అర్జున్:** ఆపరేషన్ సిందూర్ తో న్యాయం గెలవాలి. జై హింద్.

**వరుణ్ తేజ్:** ఉగ్రవాదాన్ని క్షమించేది లేదు.

**విశ్వక్ సేన్:** కొన్నిసార్లు కష్టతరమైన మిషన్లు క్లోజ్ డోర్స్ వెనుక జరుగుతాయి. షార్ప్ గా ఉండండి, ఫోకస్ గా ఉండండి. ప్రతి కదలిక ముఖ్యం. జై హింద్.

**ఆనంద్ మహీంద్రా:** మా ప్రార్థనలన్నీ భద్రతా బలగాలతో ఉంటాయి. ఒకే దేశం.. కలిసి నిలబడదాం .

**వీరేంద్ర సెహ్వాగ్:** ధర్మో రక్షతి రక్షితః.. జైహింద్ భారత సేన.

**గౌతమ్ గంభీర్:** జై హింద్.

**చేతన్ శర్మ:** భద్రత విషయంలో భారత్ ఏమాత్రం రాజీ పడదు. ఇప్పుడు ఇస్తోంది సమాధానం కాదు. ఒక సందేశం.

**ఆకాశ్ చోప్రా:** ఎల్లవేళ్లలా మద్దతుగా నిలుస్తాం. జై హింద్

### 'సిందూర్'.. తిలకం మాత్రమే కాదు.. మా సంకల్పానికి ప్రతీక

'మేం సిందూరాన్ని సంప్రదాయ తిలకంగా మాత్రమే కాదు.. మా అచంచలమైన సంకల్పానికి చిహ్నంగా కూడా ఉపయోగిస్తాం. మాకు ఎన్ని సవాళ్లు ఎదురైనా.. నిర్భయంగా, గతం కంటే బలంగా వస్తాం. భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, బీఎస్ఎఫ్‌లోని ప్రతి ధైర్యవంతుడికి వందనాలు. మీ అందరి ధైర్యం మా గర్వాన్ని మరింత పెంచుతుంది. మిమ్మల్ని చూసి దేశమంతా గర్విస్తోంది. జైహింద్' అంటూ మోహన్‌లాల్ పోస్ట్ పెట్టాడు.



## సినిమా

# 'రాబిన్‌హుడ్' వచ్చేస్తోంది

టాలీవుడ్ యంగ్‌హీరో నితిన్, శ్రీలీల జంటగా నటించిన రీసెంట్ మూవీ 'రాబిన్ హుడ్'. వెంకీ కుడుముల ఈ హీస్ట్ కామెడీని తెరకెక్కించాడు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో భారీ బడ్జెట్ తో రూపొందిన ఈ చిత్రం మార్చి 28న రిలీజ్ అయింది. ప్రమోషనల్ కంటెంట్ తో ఆడియన్స్ దృష్టిని ఆకర్షించిన ఈ చిత్రం.. థియేటర్లలో పెద్దగా అలరించలేకపోయింది. మిక్స్‌డ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ దగ్గర నిలబడలేకపోతుంది. దీంతో నితిన్ ఖాతాలో మరో ఫ్లాప్ గా మిగిలిపోయింది. ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాతోనే తెరంగేట్రం చేశాడు. అయితే తాజాగా ఈ మూవీ స్మాల్ స్క్రీన్ మీదకు రావడానికి రెడీ అయింది. 'సంక్రాంతి వస్తున్నాం', తదితర చిత్రాలను ఒకే సమయంలో అటు ఛానల్‌లో, ఇటు ఓటీటీలోకి తీసుకొచ్చింది 'జీ 5' సంస్థ. ఇప్పుడు 'రాబిన్‌హుడ్' విషయంలోనూ అదే ఫాలో అవుతోంది. ఈనెల 10న సాయంత్రం 6 గంటలకు ఈ సినిమా 'జీ తెలుగు' ఛానల్‌లో ప్రసారం కానుందని సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఓటీటీ రిలీజ్ డేట్ ఖరారు చేయలేదు. కానీ, అదే టైమ్‌కి స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



# ఓటీటీలోకి 'ఓదెల 2'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

తమన్నా ప్రధాన పాత్రలో నటించిన సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ సినిమా 'ఓదెల 2'. ఏప్రిల్‌లో బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ మూవీ ఓటీటీ రిలీజ్ డేట్ తాజాగా ఖరారైంది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో గురువారం నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ ఆడియోతో అందుబాటులో ఉండనుంది. 'ఓదెల రైల్వేస్టేషన్'కు సీక్వెల్‌గా దర్శకుడు అశోక్ తేజ ఈ చిత్రాన్ని తెరకెక్కించిన సంగతి తెలిసిందే. మరో దర్శకుడు సంపత్ నంది కథ అందిచారు. ఓదెల గ్రామంలో జరిగే కథ ఇది. ఆ ఊరిలో నవ వధువులను హత్యాచారం చేసే తిరుపతిని (వశిష్ఠ ఎన్ సింహ) అతడి భార్య రాధ (హెబ్బా పటేల్) హత్య చేసి జైలుకు వెళుతుంది. తిరుపతి పీడ విరగడైందని ప్రజలు ఆనందపడేలోపు అతడి ఆత్మ.. ప్రేతాత్మగా మారి ఊరి ప్రజలపై పగ తీర్చుకోవడం మొదలు పెడుతుంది. ఊరిలో రెండు పెళ్లిళ్లు జరగ్గా.. తిరుపతి ప్రేతాత్మ వేరొకరి శరీరంలోకి ప్రవేశించి, ఆ నవ వధువుల్ని అత్యాచారం చేసి చంపేస్తుంది. దీంతో, తిరుపతి భయంకర దుష్టశక్తిగా మారాడన్న విషయం ఓదెల వాసులకు తెలుస్తుంది. మరి ఆ తర్వాత ఏమైంది? తిరుపతి ప్రేతాత్మ ఓదెలలో ఇంకెన్ని ప్రాణాలు బలి తీసుకుంది? ఓదెలను కాపాడడానికి వచ్చిన నాగ సాధువు భైరవి (తమన్నా)కి.. తిరుపతి ప్రేతాత్మకు మధ్య ఎలాంటి పోరు నడిచింది? అన్నది ఈ సినిమా స్టోరీ.





"ఇది చాలా దూరం ప్రయాణించింది, కానీ ఇక్కడ మనం ఉన్నాము" అని క్యాప్షన్ ఇస్తూ, మే 9న శుభమ్ విడుదలను ప్రకటిస్తూ సమంత కొత్త ఆరంభం గురించి సూచన ఇచ్చింది.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net
Mobile No. 98660 19778, 89789 60131.